మీకు ఆస్థి ఉండి
తగినంత రుణ సదుపాయం
పొందలేక పోతున్నారా?
ఉచిత సలహాలకై
మమ్మల్ని సంప్రదించండి
6303988189

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్




RNI No.52722/90 సంపుటి : 32 సంచిక : 298 విశాఖపట్నం, 20 సెప్టెంబరు 2022 మంగళవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, East Godavari, West Godavari, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

## పోలవరంపై ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం



**అమరావతి:** పోలవరం విషయంలో ఆర్ అండ్ ఆర్ పరిహారం కింద గత ప్రభుత్వం కంటే ఎక్కువే ఇస్తామని చెప్పామని, దానికి సంబంధించిన జీవో కూడా ఇష్యూ చేశామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గుర్తు చేశారు. ఏపీ అసెంబ్లీ సమావేశాలు మూడవ రోజు.. సోమవారం పోలవరంపై చర్చ సందర్భంగా టీడీపీ విమర్శలు, ఆరోపణలకు ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు.

పోలవరం ప్రాజెక్టు కోసం ఏం చెప్పామో.. ఆ చెప్పినదానికి ఒక జీవోను 30 జూన్ 2021న ఇచ్చామని జీవో ప్రతిని టీడీపీ సభ్యులకు చూపించారు సీఎం జగన్. చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నామన్న ఆయన.. ఆర్ అండ్ ఆర్ కింద గత ప్రభుత్వంలో రూ.6.86 లక్షలపరిహారం

(మిగతా 2లో)

## కెనడాలో కాల్పులు



### భారతీయ విద్యార్థి మృతి

**న్యూఢిల్లీ:** కెనడాలోని అంటారియో ప్రావిన్‌లో భారతీయ విద్యార్థిపై కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో పోలీస్ సహా మరో ఇద్దరు మృత్యువాతపడ్డారు. ఈ ఘటన గత సోమవారం మిల్టన్‌లో జరిగిన కాల్పుల్లో భారతీయ విద్యార్థి గాయపడ్డాడని హాల్టన్ ప్రాంతీయ పోలీస్ సర్వీసెస్ తెలిపింది. మృతుడిని సత్వీందర్ సింగ్‌గా గుర్తించారు. అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. సత్వీందర్ సింగ్ ఎంకే ఆటో రిపేర్‌లో పార్ట్‌టైమ్‌గా పనిచేస్తున్నాడని పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కాల్పుల్లో అతను గాయపడ్డాడని, ఈ ఘటనలో టొరంటో పోలీస్ కానిస్టేబుల్ ఆండ్రూ హాంగ్, ఎంకే ఆటో రిపేర్ యజమాని షకీల్ అష్రఫ్ మృతి సైతం ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత పోలీసులు జరిపిన కాల్పుల్లో నిందితుడు సీన్ పెట్రీ (40) మరణించాడు.

## శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు 21న ఆన్‌లైన్‌లో విడుదల



**తిరుపతి:** తిరుమల శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం, ఆర్జిత సేవ, అంగ ప్రదక్షిణం టికెట్లను తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. నవంబర్ నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన(రూ. 300) టికెట్లను సెప్టెంబర్ 21న ఉదయం 9 గంటలకు విడుదల చేయనున్నట్లు టీటీడీ తెలిపింది.

నవంబర్ నెలలో శ్రీవారికి నిర్వహించనున్న కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకార సేవ, ఆర్జిత సేవా టికెట్లను సెప్టెంబర్ 21వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు టీటీడీ తెలిపింది. టికెట్ల లభ్యతను బట్టి మొదట వచ్చిన వారికి మదటి ప్రాతిపదికన కేటాయించనున్నట్లు వెల్లడించింది.

నవంబర్ నెల శ్రీవారి ఆర్జిత సేవా ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సెప్టెంబర్ 21 నుంచి అందుబాటులో ఉంటుందని తెలిపంది. అక్టోబర్ నెలకు సంబంధించి పార్లుదండాలు టోకెన్లను సెప్టెంబర్ 22న ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టీటీడీ పేర్కొంది.

అయితే, అక్టోబర్ 1 నుంచి 5వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఈ తేదీల్లో ప్రదక్షిణం టోకెన్లు జారీ చేయడం లేదని తెలిపింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి తదనుగుణంగా టికెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ కోరింది.

ఇది ఇలావుండగా, తిరుమల ఘాట్ రోడ్‌లో విద్యుత్ బస్సును ఆర్టీసీ అధికారులు ప్రయోగాత్మకంగా పరిశీలించారు. కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

(మిగతా 2లో)

## ఏజెన్సీలో సీజనల్ వ్యాధుల వివరాలు అందించండి




**పాడేరు, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో గుర్తించబడని సామాజిక గిరిజన తెగలు, సంచార జాతులకు అందుతున్న, సంక్షేమ అభివృద్ధి కార్యక్రామాల పరిశీలనకు జిల్లాకు విచ్చేసిన సామాజిక న్యాయ, సాధికారిక కేంద్ర మంత్రిత్వ శాఖ సభ్యులు తురక నరసింహ సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాలకృష్ణ ఐటిడిఎ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. అదేవిధంగా వైద్య ఆరోగ్య శాఖ పరంగా సేవలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.బి.సరోజ, విద్యా సేవలను జిల్లా విద్యా శాఖాధికారి డా. పి. రమేష్ వివరించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ప్రత్యేక ప్రతికూల పరిస్థితులు ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో తరచూ వచ్చే సీజనల్ వ్యాధులు, ఆ వ్యాధులు ఆరోగ్యశ్రీ లో కవర్ అవుతున్నదీ లేనిదీ ఆరా తీసారు. ఏజెన్సీలో వైద్య, విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలని ఆదేశించారు. జిల్లాలోని పరిస్థితులు నివేదిక అందజేస్తే కేంద్ర మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో గుర్తించబడని జాతులు, సంచార జాతులు ఎవరూ లేరని తెలుసుకున్న సభ్యులు ఆరా తీసి వివరాలు అందజేయాలన్నారు.

ప్రత్యేక పరిస్థుల దృష్ట్యా ప్రజలలో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉంటుందని, అటువంటి వారు ఇక్కడి అడవులలో దొరికే ఆయుర్వేద, ఇతర మందులు, పళ్ళు, కాయలు,ఆకులు లాంటి ఏ ఉత్పత్తులు తీసుకుంటే హిమోగ్లోబిన్ పెంచుకోవచ్చో, వ్యాధి నిరోధకత పెంచుకోవచ్చో అధ్యయనం చేసి నివేదిక అందించాలని సూచించారు. వారికి ఏ కారణంగా ప్రత్యేక వ్యాధులు వచ్చే అవకాశాముున్నదో నివేదిక అందచేయాలన్నారు.

ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులను సబ్జెక్టుల వారీగా గ్రూపులుగా విభజించి వారి వారి సబ్జెక్టులలో సిలబస్, వారి భోధనా పద్ధతులను పరీక్షించారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాల్సిన భాద్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్రంలో ఆంగ్ల మీడియం విద్య ప్రవేశ పెట్టడం సాహసోపేతమైన నిర్ణయంగా అభివర్ణించిన సభ్యులు ఆంగ్ల బాష చాలా అవసరమని, తద్వారా విద్యార్థుల అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఉపాధ్యాయులు గుణాత్మక విద్యను అందించాలని కోరారు. ఇంకా విద్య విధానంలో తీసుకు

(మిగతా 2లో)

## డిప్యూటీ స్పీకర్‌గా కోలగట్ల



ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ గా వైసీపీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి ఇవాళ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిప్యూటీ స్పీకర్ పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో కోలగట్ల ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు స్పీకర్ ప్రకటించారు. దీంతో కోలగట్లను అధికార, ప్రతిపక్ష సభ్యులంతా అభినందనలు తెలిపారు.

ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ గా ఉన్న కోన రఘుపతి తాజాగా ఆ పదవి నుంచి తప్పుకోవడంతో ఆయన స్థానంలో కోలగట్లకు అవకాశం లభించింది. అధికార పార్టీ నిర్ణయం మేరకు విజయనగరం వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న కోలగట్ల వీరభద్రస్వామిని డిప్యూటీ స్పీకర్ గా సభ్యులు ఎన్నుకోవాల్సి ఉంది. అయితే విపక్ష టీడీపీ నుంచి ఎవరూ పోటీ చేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది.

సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం తనను డిప్యూటీ స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు బాధ్యతలు స్వీకరించాక కోలగట్ల తెలిపారు. టీవీలు, ఇతర మాధ్యమాల ద్వారా సభా కార్యక్రమాలను ప్రజలు గమనిస్తుంటారని, సభ పట్ల, సభ్యుల పట్ల గౌరవం పెంపొందించుకునే విధంగా అందరూ పనిచేయాలని కోలగట్ల కోరారు. సభలో చర్చలు అర్థవంతంగా సాగేందుకు సభ్యులు సహకరించాలని, సభ్యులు వివిధ అంశాలపై పూర్తి అవగాహనతో రావాలని కూడా కోలగట్ల సూచించారు. తమను ఎన్నుకున్న ప్రజల మనోభావాల్ని గౌరవిస్తూ, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా చట్టసభల్ని వాడుకునేందుకు అందరూ కృషి చేయాలన్నారు.

డిప్యూటీ స్పీకర్ గా కోలగట్ల వీరభద్రస్వామిని కూర్చోబెట్టడం సంతోషంగా ఉందని సీఎం జగన్ తెలిపారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా.. రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేయడం, ఇప్పుడు డిప్యూటీ స్పీకర్ గా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కోలగట్ల కంటే ముందు డిప్యూటీ స్పీకర్ గా ఉన్న కోన రఘుపతి సేవల్ని కూడా సీఎం జగన్ ప్రశంసించారు. డిప్యూటీ స్పీకర్ గా చట్టసభలో అందరికీ మంచి చేయాలని ఆశిస్తున్నట్లు జగన్ తెలిపారు.

## అర్జీలను నిర్ధేశిత సమయంలో పరిష్కరించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని , ఎట్టి పరిస్థితుల్లోను రీ ఓపెన్ కాకూడదని జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారం మరియు పలు విషయాల పై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా వివిధ సమస్యలపై ప్రజల నుండి స్వీకరించిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత సమయంలో పరిష్కరించాలన్నారు. స్పందన అర్జీలు ఎట్టి పరిస్థితుల్లోనూ రీ ఓపెన్ కాకూడదని, కాలపరిమితిలోగా దరఖాస్తులన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. వచ్చిన అర్జీలను కాలపరిమితిలోగ పరిష్కరించిన తరువాత దాని యొక్క ఫోటోను స్పందన పోర్టల్ లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఆదేశించారు. ప్రతిరోజు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలన్నారు. మంజూరు చేసిన ఇళ్ళు అన్నింటినీ గ్రౌండింగ్ చేయాలన్నారు. ఇసుక, సిమెంటు, స్టీలు సామాగ్రి కొరత లేకుండా సరఫరా చేయాలన్నారు.

అదేవిధంగా జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా తల్లుల ఖాతాలలో జమ చేసిన ఫీజులను కాలేజీ యాజమాన్యాలకు అందేలా చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ - శ్రమ్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. గడప గడపకు కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత కల్పించాలని, ప్రజల నుంచి వచ్చే వినతులను పరిష్కరించాలని తెలిపారు. స్పందన ద్వారా అత్యధికంగా జీవీఎంసీ వినతులు వస్తున్నాయని , వీటిలో వీధిదీపాల సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు . చేయూత కార్యక్రమాన్ని ఈ నెల 22న ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని, 23 నుండి 29 వరకు మండల,

(మిగతా 2లో)

## తెదేపా సభ్యులను ఒకరోజు సస్పెండ్ చేసిన స్పీకర్



ఏపీ అసెంబ్లీ నుంచి టీడీపీ సభ్యులు మరోసారి సస్పెండ్ అయ్యారు. సభలో కార్యక్రమాల నిర్వహణకు అడ్డుపడుతున్నారంటూ ప్రభుత్వం నుంచి డిప్యూటీ సీఎం అంజాద్ బాషా సస్పెన్షన్ తీర్మానం ప్రదిపాదించారు. స్పీకర్ వారిని ఒక రోజు సభ నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. టీడీపీ ఈ ఉదయం సభ ప్రారంభం సమయంలో రైతు సమస్యల పైన వాయిదా తీర్మానం ఇచ్చింది. దీనిని ప్రశ్నోత్తరాల తరువాత స్పీకర్ తిరస్కరించారు.

ఉదయం వైసీపీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా టీడీపీ, తెలుగు రైతు ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఎడ్లబండి కాడె మోస్తూ అసెంబ్లీ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అయితే, తెలుగుదేశం నిరసనకు ఎడ్ల బండి ఇచ్చిన రైతును సీఐ తీవ్రంగా కొట్టారంటూ మాజీ మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు.

రైతుని కొట్టిన అంశంపై అసెంబ్లీలో నూ నిరసన తెలుపుతామన్నారు. సమావేశాల్లో ప్రశ్నోత్తరాల్లో భాగంగా పోలవరం పైన వాదోపవాదనలు సాగాయి. ముఖ్యమంత్రి జగన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమాధానం ఇచ్చారు. ఆ తరువాత డిప్యూటీ స్పీకర్ గా కొలగట్ల వీరభద్రస్వామి ఏకగ్రీవంగా ఎన్నిక కావటంతో..ప్రభుత్వం -అధికార పక్షం గౌరవంగా అయన్ను సీటు వద్దకు తీసుకొచ్చారు.

ముఖ్యమంత్రి జగన్.. మంత్రులు.. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు స్వామికి అవకాశం దక్కటం పట్ల మాట్లాడారు. ఆ తరువాత సభ ప్రారంభమైన సమయం నుంచి రైతులపైన పోలీసులు కేసులు పెట్టటం..కొట్టటం ఏంటని టీడీపీ ఆందోళనకు దిగింది. వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి

(మిగతా 2లో)

## ఆర్ఐఎన్ఎల్‌లో భద్రతా వారోత్సవాలు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జె. శివశంకరరెడ్డి- జాయింట్ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, గవర్నమెంట్. ఏపీ ఎకె సక్సేనా, డైరెక్టర్ (ఆపరేషన్స్), ఆర్ఐఎన్ఎల్‌తో కలిసి ఎస్ఎంఎస్-2 యొక్క ఏరియా షాప్ ఆఫీస్‌లో ఈ రోజు భద్రతా జెండాను ఎగురవేసి వేడుకలను ప్రారంభించారు. భద్రతా పరికరాలు, భద్రతా నమూనాలు మరియు నమూనాల ప్రదర్శనతో ప్రదర్శన నిర్వహించబడింది.

ఆర్ఐఎన్ఎల్-విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ యొక్క స్టీల్ మెల్ట్ షాప్-2 విభాగం 19.09.2022 నుండి 24.09.2022 వరకు భద్రతా వారోత్సవాలను జరుపుకుంటుంది. భద్రతా అంశాలపై వర్క్‌షాప్‌లు, షాప్ ఫ్లోర్‌లో సేఫ్టీ మార్చ్‌లు, రోడ్ సేఫ్టీ క్యాంపెయిన్, గ్యాస్ అండ్ ఫైర్ మాక్ డ్రిల్‌లు మొదలైన వివిధ కార్యకలాపాలు ఈ భద్రతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించబడుతున్నాయి. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులందరికీ సేఫ్టీ వ్యాస రచన, సేఫ్టీ క్విజ్, సేఫ్టీ స్లోగన్, సేఫ్టీ పోస్టర్ పోటీలు నిర్వహిస్తున్నారు.

సీనియర్ అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులను ఉద్దేశించి ఫ్యాక్టరీ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకరరెడ్డి మాట్లాడుతూ సురక్షిత పద్ధతులు పాటించడం అలవాటు చేసుకోవాలన్నారు. భద్రతా మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా అమలు పరచాలని అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం లో అనుసరిస్తున్న వివిధ భద్రతా చర్యలను ఫ్యాక్టరీ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ. జె.శివశంకరరెడ్డి ప్రత్యేకంగా ప్రశంసించారు . "భద్రత నా బాధ్యత" అనే థీమ్‌తో కూడిన కీ చైన్ ను ఫ్యాక్టరీల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆవిష్కరించారు.

తన ప్రసంగంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీ ఎకె సక్సేనా- పని ప్రదేశంలో భద్రత యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు మరియు "భద్రత నా బాధ్యత" అనే భావనను ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలి అని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ కార్మిక సంఘాల సంఘాల ప్రతినిధులు కె.సత్యనారాయణ రావు- ప్రెసిడెంట్ ఏఐటీయూసీ, బి.అప్పారావు-లీడర్ ఫ్రమ్ సీఐటీయూ, ఎం.రమణ మూర్తి- లీడర్ ఫ్రమ్ ఐఎన్‌టీయూసీ కూడా ప్రసంగించారు.

అభిజిత్ చక్రభర్తి సిజిఎం (డబ్ల్యూ)-ఐ/సి, బికె మొహంతి సిజిఎం(మెయింట్/ఐరన్)ఐ/సి, శ్రీ ఎంఎస్‌వి కృష్ణయ్య సిజిఎం (సేఫ్టీ & ఎన్విరాన్‌మెంట్), శాంతను దే- జిఎం(ఎస్ఎంఎస్-2)- ఇంఛార్జ్ & డిపార్ట్‌మెంట్ హెడ్, ఎస్ఎంఎస్-2 విభాగానికి చెందిన ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## (మొదటి పేజీ తరువాయిలు)

### పోలవరంపై ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం

ప్రకటిస్తే.. తాము అధికారంలోకి వస్తే పది లక్షల రూపాయలు ఇస్తామని చెప్పామని, అందుకు సంబంధించిన జీవో స్పష్టంగా ఉందని తెలియజేశారు.

లెక్క వేస్తే ఆ ఖర్చు రూ.500 కోట్లు మాత్రమే అన్న ఆయన.. ఎవరూ భయపడాల్సిన, బాధపడాల్సిన అవసరం లేదని.. అమ్మ ఒడి, ఆసరా లాంటి పథకాలకే అంతకు మించి సొమ్ము బటన్ నొక్కి బదిలీ చేశామని, కాబట్టి పోలవరం బాధితులకు పునరావాసం పూర్తికాగానే పరిహారం బదిలీ చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును నాశనం చేసిందే చంద్రబాబు అని పేర్కొన్న సీఎం జగన్.. దాని రిపేర్‌కు తమ ప్రభుత్వం కుస్తీలు పడుతోందని తెలిపారు.

కేంద్రం నుంచి రూ.2,900 కోట్ల నిధులు రావాల్సి ఉందని, ఆ నిధులు బ్లాక్ కావడం వెనుక ఘనత చంద్రబాబుదేనని ఎద్దేవా చేశారు సీఎం జగన్. ఆనాడే కేంద్రాన్ని నిలదీయాల్సింది పోయి ఇప్పుడు విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పోలవరం పనులు.. నిర్వాసితులకు అందిన పరిహార విషయంలో చంద్రబాబుగారి హయాంలో గణాంకాలు.. తమ ప్రభుత్వ గణాంకాలు పరిశీలిస్తే ఎవరికి చిత్తశుద్ధి ఎంత ఉందో స్పష్టం అవుతుందని సీఎం జగన్ తెలిపారు. అంతేకాదు.. ప్రాజెక్టు పనులకు సంబంధించిన స్లైడ్స్ వేసి మరీ టీడీపీకి 'సినిమా' చూపించారాయన.

### శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు 21న ఆన్‌లైన్‌లో విడుదల

గోపీనాథ్ రెడ్డి, చీఫ్ మెకానికల్ ఇంజనీర్ రవివర్మ, తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి చంగల్ రెడ్డి, తిరుపతి డిపో మేనేజర్ పి. విశ్వనాథ్ పరిశీలించారు.

ఓలెక్ట్రా కంపెనీకి చెందిన అధునాతన విద్యుత్ బస్సును ఆర్టీసీ అధికారులు ప్రయోగాత్మకంగా పరిశీలించారు. కాగా, తిరుమల ఘాట్ రోడ్ లో ఈ బస్సుల పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు ఆర్టీసీ మెకానికల్ ఇంజనీర్ రవివర్మ. విద్యుత్ బస్‌లో ఎటువంటి సమస్యలు లేకుండా ఘాట్ రోడ్డు ప్రయాణం చేయవచ్చని తెలిపారు. తిరుమల తిరుపతిల మధ్య ఈ నెలాఖరికి 10 విద్యుత్ బస్సులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

### ఏజెన్సీలో సీజనల్ వ్యాధుల వివరాలు అందించండి

రావలసిన మార్పులు, సిలబస్ మార్పు, తదితర అంశాలపై ఉపాధ్యాయులు అధ్యయనం చేసి నివేదిక అందించాలన్నారు.

ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాల కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో గురించబడని, సంచార జాతుల వారు లేరని తెలిపారు. మిషన్ కనెక్ట్ పాడేరు కింద రోడ్ కనెక్టివిటీ లేని గ్రామాలకు రోడ్ల ఏర్పాటుకు రూ.735 కోట్లతో ప్రతిపాదించటం జరిగిందని, అదేవిధంగా నెట్ కనెక్టివిటీకి చర్యలు తీసుకుంటున్నామని సభ్యులకు తెలిపారు. అదేవిధంగా అటవీ హక్కుల చట్టం అమలులో భాగంగా ఇప్పటివరకు లక్ష ఆరు వేల ఎకరాల భూమిని గిరిజనులకు పంపిణీ చేయటం జరిగిందని తెలిపారు.

ముందుగా సభ్యులు తురక నరసింహ శ్రీ మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అన%శీ%తరం ఐటిడిఎ సమావేశ మందిరం చేరుకున్న సభ్యులు కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన గావించి, డా. అంబేద్కర్, స్వామి వివేకానంద, జ్యోతిరావు పూలే చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అశుతోష్, జిల్లా రెవిన్యూ అధికారి బి. దయానిధి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.బి.సరోజ, జిల్లా విద్యా శాఖాధికారి డా. పి. రమేష్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, జిల్లా అటవీ శాఖాధికారి వినోద్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అర్జీలను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలి

జోనల్ స్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి చేయూత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధికారులు వారంలో మూడు రోజులు తప్పనిసరిగా క్షేత్రస్థాయి పర్యటన చేయాలని, అక్కడ సమస్యలను పరిష్కరించాలన్నారు. సచివాలయాలలో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఈనెల 21 వ తారీఖున నిర్వహించే జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

తదుపరి కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ప్రజలనుండి విజ్ఞప్తులు స్వీకరించారు.

సోమవారం స్పందన కార్యక్రమంలో 225 విజ్ఞప్తులు అందాయి.

ఈ స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కే.ఎస్. విశ్వనాథన్ , జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ , జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### అసెంబ్లీ నుంచి టీడీపీ సభ్యుల సస్పెన్షన్ - వైసీపీ సభ్యుల డిమాండ్.!

మాట్లాడుతున్న సమయంలో సభలో అడ్డు తగిలారు.

దీంతో..మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేసారు. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా.. టీడీపీ సభ్యులు బయటకు వెళ్లాలని డిసైడ్ అయ్యే ఈ రకంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. దీంతో.. వెంటనే ప్రభుత్వం టీడీపీ సభ్యుల సస్పెన్షన్ తీర్మానం చేసారు. ప్రస్తుత సమావేశాలు జరిగిన రెండు రోజులు..నేడు వరుసగా టీడీపీ సభ్యుల పైన సస్పెన్షన్ వేటు పడింది. ఆ తరువాత కూడా సభలో టీడీపీ సభ్యుల తీరు పైన చర్చ జరిగింది. వారి పైన పూర్తిగా సస్పెన్షన్ వేటు వేయాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేసారు.

విశాఖ సమాచారమ్
చదవండి చదివించండి
సెల్: 9393949345
8247526179

# పలుకులమ్మ మెచ్చిన కేరింత విద్యాధరి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగరానికి చెందిన రెండేళ్లు నిండని పసికూన తన అద్భుత మేధాశక్తితో అంతర్జాతీయ స్థాయి అవార్డులను కైవసం చేసుకుంది. మురళి నగర్ ప్రాంతానికి చెందిన చిన్నారి సిరికి విద్యాధరి ఔరా అనిపించే రీతిలో పలు అవార్డులను సొంతం చేసుకుంది. సిరికి నూక నాయుడు, శాంతి దంపతుల ద్వితీయ సంతానం విద్యాధరి. బుడిబుడి అడుగులు వేస్తూ, చిలిపి చేష్టలతో ముద్దులొలికించే మాటలతో చిన్నారి విద్యాధరి తన అద్భుత జ్ఞాపక శక్తితో అత్యంత ప్రతిష్టాత్మకమైన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్ సంస్థ నుండి వండర్ కిడ్ అవార్డును చేజిక్కించుకుంది. ప్రపంచంలోనే రెండేళ్లలోపు ఈ అరుదైన రికార్డును సృష్టించి చిన్నారి విద్యాధరి వండర్ కిడ్ గా అవతారమెత్తింది.

కేవలం 46 సెకండ్ల వ్యవధిలో దేశంలోని 28 రాష్ట్రాల రాజధానులను టకటక చెప్పడంలో దిట్ట. ఎవరు అడిగినా ఏ మాత్రం తడుముకోకుండా రాజధానుల పేరుల చెపుతూ తన సత్తా ఏమిటో తెలియజేస్తోంది. శరీర భాగాల పేర్లు, పండ్లు, కాయగూరలు, పుష్పాలు, వాహనాలు, పక్షులు, జంతువుల పేర్లను ఆంగ్లంలో చక చక చెబుతుంది. ఎ నుండి జెడ్ వరకు ఎ ఫర్ ఆపిల్ అంటూ జెడ్ ఫర్ జీబ్రా వరకు చిన్నారి విద్యాదరి చెబుతుంది.

బాల మేధావి విద్యాధరి ఆంగ్లంలో వారాల పేర్లు కుటుంబ సభ్యుల వివరాలు నెంబర్లు చెప్పడంతో పాటు మన జాతీయ చిహ్నాలు, జాతీయ జంతువులు, నదులు గురించి టకటక చెబుతూ అబ్బురపరుస్తుంది. పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్లుగా చిన్నారి యోగాసనాలు వేస్తూ అందరినీ ఆశ్చర్య చికితులను చేస్తూ వండర్ కిడ్ గా రికార్డును విద్యాధరి తన పేరిట లిఖించుకుంది.

ఇలా ఎన్నో అద్భుతాలతో రెండేళ్ల ప్రాయం నిండకుండానే ప్రపంచంలోనే వండర్ కిట్ గా రికార్డ్ సృష్టించి మన విశాఖ కీర్తి ప్రతిష్టలను ప్రపంచవ్యాప్తంగా చిన్నారి విద్యాధరి చాటిచెప్పింది. అదేవిధంగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ విద్యాధరి ప్రతిభాపాటవాలను గుర్తించి మల్టిపుల్ మెమరీ యాక్టివిటీస్ బై ద యంగెస్ట్ ఏజ్ అవార్డును ప్రదానం చేసింది. ఇలా ఆ చిన్నారి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించుకునేలా ఆమె తల్లి శాంతి ఇచ్చిన తర్ఫీదు ఎంతో ప్రశంసనీయం. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల జ్ఞాపక మేధాశక్తిని పెంపొందించి వారిలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీస్తే ఎందరో తన కుమార్తె వలె ఎన్నో రికార్డులు సృష్టించే అవకాశం ఉందని ఆమె తెలిపారు. తన భర్త నాయుడు అందించిన సహకారంతోనే తన బిడ్డను వండర్ కిడ్ గా తీర్చిదిద్దగలిగానని శాంతి చెప్పారు. కాగా శనివారం ఉదయం విశాఖ పౌర గ్రంథాలయంలో రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో చిన్నారి విద్యాధరికి జరిగిన ఆశీర్వచన అభినందన కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు PAR పాత్రుడు, నాగనబోయిన నాగేశ్వరరావు, AR జోగారావు, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు వీరుమామ, కోరుకొండ రంగారావు, ప్రముఖ బిల్డర్ RVV సత్యనారాయణ, పార్వతీదేవి దంపతులు, జమ్మా చినబాబు, తదితరులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. శ్రీమతి రత్నా సింగ్ చిన్నారి పై కవిత చదివి వినిపించారు. రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బాదంగీర్ సాయి వందన సమర్పణ చేసారు.

# చీరాల నుంచి టీడీపీ అభ్యర్థిగా పురంధేశ్వరి కుమారుడు హితేష్?



తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడికి దగ్గుబాటి వెంకటేశ్వరరావు తోడల్లుడు. కొన్నాళ్ల క్రితం వరకు ఈ నేతల మధ్య రాజకీయ వైరుధ్యాలున్నప్పటికీ అవి సమసిపోయాయంటూ వార్తలు వచ్చాయి. రాష్ట్ర విభజన అనంతరం ఆయన సతీమణి పురంధేశ్వరి బీజేపీలోకి వెళ్లగా వెంకటేశ్వరరావు రాజకీయాలకు దూరం జరిగారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పర్చూరు నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు.గతానికి భిన్నంగా చంద్రబాబు ఎన్నికలకు ఏడాదిన్నరకు పైగా సమయం ఉన్నప్పటికీ గతానికి భిన్నంగా చంద్రబాబు అభ్యర్థులను ఖరారు చేస్తున్నారు. ఈ క్రమంలోనే సిట్టింగ్‌లందరికీ సీట్లని ప్రకటించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పర్చూరు నుంచి ఏలూరి సాంబశివరావు గత ఎన్నికల్లో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లోనే పర్చూరు నుంచి దగ్గుబాటి వెంకటేశ్వరరావు- పురంధేశ్వరి కుమారుడు హితేష్ పోటీచేస్తాడని అందరూ భావించారు. కానీ పౌరసత్వం గడువు ముగియకపోవడంతో వెంకటేశ్వరరావు వైసీపీ తరపున బరిలోకి దిగి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత ఆయన రాజకీయాలకు దూరమయ్యారు. దగ్గుబాటికి, చంద్రబాబుకు తగ్గుతున్న అంతరం? ఇటీవలి పరిణామాల్లో దగ్గుబాటి చంద్రబాబుకు దగ్గరవుతున్నారని, తన కుమారుడు హితేష్‌ను తెలుగుదేశం పార్టీలోకి తెచ్చి చీరాల సీటు తీసుకుంటారంటూ వార్తలు వస్తున్నాయి. సిట్టింగ్‌లందరికీ సీట్లనడంవల్ల పర్చూరు ఏలూరి సాంబశివరావుకు ఓకే అయ్యింది. దీంతో హితేష్ ను చీరాలో నిలబెడతారని తాజాగా వార్తలు వస్తున్నాయి. వాస్తవానికి చీరాల నియోజకవర్గాన్ని పొత్తు కుదిరితే జనసేనకు ఇవ్వాలనే ఆలోచన పార్టీ చేస్తోంది. అంతేకాకుండా వైసీపీ తరపున మళ్లీ పోటీచేయడానికి ఆమంచి కృష్ణమోహన్, కరణం బలరాం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. సీటిస్తే పోటీచేస్తానంటూ కరణం బలరాం తనయుడు వెంకటేష్ తాజాగా ప్రకటించారు.

# జర్నలిస్టులు సామాజిక బాధ్యతతో మెలగాలి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జర్నలిస్టులు రాణించడంలో ఎప్పటికప్పుడు అవసరమైన మెళకువలను అమలు చేస్తూనే అంకిత భావంతో వృత్తిలో పాటిస్తూండాలని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ పూర్వ ఉప కులపతి ఆచార్య బాల మోహన్ దాస్ అభిప్రాయపడ్డారు. ఆదివారం అల్లూరి సీతారామజరాజు స్మారక విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన ఒక రోజు పునఃశ్చరణ తరగతులులో ఆచార్య వి. బాలమోహన్ దాస్ మాట్లాడుతూ పలు అంశాలను ప్రస్తుతించారు. జర్నలిస్టులకు సమయపాలన అవసరమని చెప్పిన ఆయన ఇంకా నేర్చుకోవాలనే జిజ్ఞాసను కలిగి ఉండాలన్నారు. ఆచరణలో అమలు చేసుకుని స్వీయ వృద్ధిని సాధించుకోవాలన్నారు. రాసే వార్తా కథనాలు, న్యూస్ అన్ని పత్రికల్లోనూ ఒకే రీతిగా ఉండకూడదనీ చెప్పారు , అలా ఉంటే కాపీ న్యూస్ పాఠకులు భావించే అవకాశం ఉందన్నారు. ఎప్పటికప్పుడు తమను సాంకేతికత పరంగా వృద్ధి చేసుకోవాలని సూచించారు. స్మార్ట్ సిటి రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బంగారు అశోక్ కుమార్ మాట్లాడుతూ చాలా కాలంగా అనుకుంటున్న వర్కింగ్ జర్నలిస్టులకు పునశ్చరణ తరగతులు ఎన్ఎస్ఆర్ సహకారంతో నిర్వహించినట్లుగా చెప్పారు. ఈ వర్క్ షాప్ నిర్వహణ సాటి జర్నలిస్టుగా, నిర్వాహక సంస్థ వ్యవస్థాపకునిగా తనకెంతో సంతృప్తిని ఇచ్చిందని చెప్పారు. భవిష్యత్తులో జర్నలిస్టులకు విధి నిర్వహణలో నైపుణ్యాలనూ, మెళకువలనూ తెలిపే వర్క్‌షాపుల నిర్వహిస్తామన్నారు. సీనియర్ జర్నలిస్టు నాగనబోయిన నాగేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహించడం ప్రభుత్వం చేసినట్లుగా బంగారు అశోక్ కుమార్ రూపొందించారన్నారు. నెల రోజుల కృషి ఫలితం ఇందులో ఉందన్నారు. నిధుల సమీకరణ మొదలు అనేక ప్రయాశలకు ఓర్చి అధ్యక్షులు అశోక్ కుమార్ వహించిన పాత్ర. విజయం వర్ణించలేనిదన్నారు.

**నూరు శాతం ప్రయోజనాత్మక వర్క్‌షాప్:**

ఒక రోజు కార్యశాలలో పలువురు జర్నలిజం ఉద్దండులు తమ ప్రజ్ఞాపాటవాలతో చైతన్య దీప్తిలుగా నిలిచారు. అయిదు అంశాల్లో అయిదుగురు ఉద్దండులైనా లబ్ధప్రతిష్టులతో నిర్వాహకులు ఏర్పాటు చేసిన గెస్టు లెక్చర్స్ ప్రతి జర్నలిస్టుకూ తమ రంగంలో కొత్త ఉత్సాహాన్ని మార్గదర్శకత్వంను నింపింది. తొలుత ప్రారంభ ఉపన్యాసం డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం శ్రీకాకుళం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ రెడ్డి తిరుపతిరావు వార్త రచన, చట్ట నింబంధనలు, క్రైం న్యూస్ సోషల్ మీడియాలో ఎదురవుతున్న సవాళ్లపై ప్రసంగించారు. జర్నలిజం బోధకులు, సామాజిక పరిశోధకులూ, నవ రచయిత డాక్టర్ జికెడి ప్రసాద్ తెలుగు జర్నలిజం నూతన ఆవిష్కరణలు అంశంపైనా, విజయవాడ నుంచి వచ్చిన సీనియర్ పాత్రికేయులు బి.నగేష్ ఎలక్ట్రానిక్ మీడియాకు వార్తలు రాయడం ఎలా, సవాళ్లు పరిష్కారాలు అంశంపై విశ్లేషనాత్మక ప్రసంగం చేశారు. వార్త రచనలో నూతన పోకడలూ పత్రికలు, టెలివిజన్ మీడియాలపై ప్రభావం అంశం పై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ జి. లీలా వర ప్రసాదరావు ప్రసంగించారు. చివరిగా వార్తలు సేకరణ, రచన, భాష, పత్యేక విభాగాలు (బీట్) అంశంపై విశాఖపట్నం రచయిత, సీనియర్ పాత్రికేయులు ఎన్ నాగేశ్వర రావు (ఎన్ఎన్ఆర్ఆ) వివరించారు. అనంతరం బాదంగీర్ సాయి వంటి జర్నలిస్టులు తమ ప్రస్తానం గురించి వివరించారు. కార్యక్రమం నిర్వహణలో కార్యవర్గ సభ్యులూ భాగం అయ్యారు. ఏకబిగిన సాగిన ఈ వర్క్‌షాప్ లో పాల్గొన్న పాత్రికేయులకు సర్టిఫికేట్లను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి. విజయలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరమైన వార్తల ప్రజెంటేషన్ తీరు తెన్నులు పాటించాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు.

మంగళవారం 20-9-2022
శుభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం వర్ష రుతువు
భాద్రపద మాసం

తిథి : బ. దశమి రా. 09.25
నక్షత్రం : పునర్వసు రా. 09.04
వర్జ్యం : రా. 07.37 ల 09.24 వ



సమస్యలతో సతమతమవడం కంటే సాధకుల సహాయం కోరుట మేలు.
బ్రహ్మశ్రీ హనుమద్దాస్ స్వామీజీ గారు ప్రస్తుతం చెన్నై నగరంలో ఉన్నారు.
సెల్ : 9440537607

### గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 11వ వార్డు బాలాజీ నగర్ పరిధి, క్రాంతి నగర్ లో స్థానిక కార్పొరేటర్ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆధ్వర్యంలో గడప గడపకి మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త విజయ నిర్మల పాల్గొన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. జగనన్న ఇస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు ముఖ్యంగా అమ్మఒడి, వసతి దీవెన, విద్య దీవెన, చేయూత, ఆసరా, పథకాలపై ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని ఆమెకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక వైకాపా సీనియర్ నాయకులు గొల గాని శ్రీనివాస్,కొరికాన మోహన్ రావు, సత్యనారాయణ,పద్మ,రమణమ్మ, సిఓ వాసు, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

### రూ.30 కోట్ల బ్యాంక్ ఫ్రాడ్.. నలుగురు అధికారుల అరెస్ట్..

దేశంలో బ్యాంకుల పనితీరు బాగానే ఉంది. కానీ అప్పుడప్పుడూ కొంతమంది అధికారులు మోసాలకు పాల్పడిన వార్తలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. అలా ఇండియన్ బ్యాంక్‌కు చెందిన నలుగురు సీనియర్ అధికారులు రూ.30 కోట్ల మోసానికి పాల్పడిన విషయం ప్రస్తుతం సంచలనంగా మారింది.

అధికారుల అరెస్ట్.. చెన్నై ఇండియన్ బ్యాంక్‌లో భారీ మోసానికి పాల్పడిన నలుగురు అధికారులకు 3 ఏళ్ల జైలు శిక్ష పడింది. చెన్నైలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం నలుగురు బ్యాంకు అధికారులతో పాటు మరో ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున జరిమానా సైతం విధించారు. ఇందులో బ్యాంక్ చీఫ్ మేనేజర్ అజీజ్, సీనియర్ మేనేజర్ జీవీ శ్రీనివాసన్, సీనియర్ మేనేజర్ ముత్తయ్య, జనరల్ మేనేజర్ ఎస్. అరుణాచలం ఉన్నారు.37 నెలల కఠిన కారాగార శిక్ష.. అదేవిధంగా M/s కిరణ్ ఓవర్సీస్ లిమిటెడ్‌కు చెందిన రంజీవ్ పాత్ర, అతని భార్య కిరణ్ పాత్ర ఒక్కొక్కరికి రూ.10,000 జరిమానాతో 37 నెలల పాటు కఠిన కారాగార శిక్షను అనుభవించాలి. చెన్నై కిరణ్ ఓవర్సీస్ లిమిటెడ్, ఢిల్లీకి చెందిన M/S కిరణ్ ఓవర్సీస్ లిమిటెడ్‌లకు కోర్టు ఒక్కొక్కటి రూ.10,000 జరిమానా విధించింది.

నకిలీ పత్రాలతో.. నిందితులు రుణం కోసం బ్యాంకుకు తప్పుడు, నకిలీ పత్రాలు సమర్పించారని, బ్యాంకు ఆర్థిక ప్రయోజనాలను కాపాడకుండా కొందరు బ్యాంకు అధికారులు రుణం మొత్తాన్ని విడుదల చేశారని విచారణలో తేలింది. నిందితుడి కారణంగా ఇండియన్ బ్యాంక్ రూ.39.18 కోట్ల నష్టాన్ని చవిచూసింది.

### చిన్నమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంఆర్పిఎస్ కు వితరణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సోమవారం విశాఖపట్నం, అంబేద్కర్ భవన్ లో ఎంఆర్పిఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) వ్యవస్థాపకులు మాన్యశ్రీ మందా కృష్ణ మాదిగలి గారి ఆధ్వర్యంలో ఎంఆర్పిఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజులి ఆంధ్ర రాష్ట్ర ఎంఆర్పిఎస్ అధ్యక్షులు రుద్రపోగు సురేష్. తెలంగాణ ఎంఆర్పిఎస్ అధ్యక్షులు గోవిందు నరేష్ సారథ్యం లో ఏర్పాటు చేసిన ఎంఆర్పిఎస్ జాతీయ కార్యవర్గ సమావేశం కొరకు ఖర్చుల నిమిత్తం .5,000/- లు మోర్చ చిన్నమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారి అమ్మగారి జ్ఞాపకార్థం ఆర్థిక సహాయం చేసిన మోర్చ సన్యాసి రావు. ఈ సందర్భంగా మందా కృష్ణ మాదిగని మున్నంగి నాగరాజు & రుద్రపోగు సురేష్ ల ద్వారా మర్యాద పూర్వకంగా కలిసిన మోర్చ సన్యాసి రావు.

ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల ఎంఆర్పిఎస్, ఎంఎస్పి, ఎంఇఎఫ్, ఎంజెఎఫ్, ఎంవైసీ, ఎంఎస్ఎఫ్, విఐపిఎస్, ఎంఎల్ఎఫ్ సంఘాల కార్యవర్గ సభ్యులు మరియు ఎస్సి కుల రిజర్వేషన్స్ మద్దతుగా విశాఖ రెల్లి కుల సంఘం నాయకులు ఆడమ్స్, కస్తూరి వెంకటరావు, ఎంఈఎఫ్ ప్రెసిడెంట్ యందవ నారాయణ రావు, ఎంపీటీసీ దాలయ్య, ఎంపీటీసీ బోనేల గోపి, మాసిపోగు రాజు, తదితరులు పాల్గొన్నారు.

# భోజనానికి ముందు నీరు తాగడం మంచిదేనా..



అయితే, భోజనం చేసే సమయంలో, భోజనం తర్వాత, ముందు నీరు తాగడం వల్ల సమస్యలు వస్తాయనడం మీకు తెలుసా.. ఎందుకంటే ట్యాక్సిన్స్ పేరుకుపోవడానికి ఈ అలవాటు కారణమవుతుంది. ఇది ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని కొంతమంది చెబుతున్నారు.

**తినేటప్పుడు నీరు..** అయితే ఇక్కడ ఏం చెప్పుకోవాలంటే భోజనంతో పాటు నీరు తాగడం వల్ల మీ జీర్ణ క్రియ నెమ్మదయ్యేలా పొట్టలోని ఆమ్లాలు కరిగిపోతాయనడానికి ఎలాంటి అధ్యయనం లేదు. అయినప్పటికీ, మీ కడుపులోని ఆమ్లాలు నీటిలో కలుస్తాయని చెప్పలేం. అవి హైడ్రోక్లోరిక్ యాసిడ్ యొక్క ప్రధాన విధిని జీర్ణించుకోవడం కష్టతరమైన ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలను శోషించడం అనేది కచ్చితంగా పలుచన చేస్తుంది. దాని ప్రభావాన్ని కూడా తగ్గిస్తుంది.

**ఫుడ్‌ని బట్టి..** అలాగే మీరు తీసుకునే భోజనం బట్టి కూడా నీరు తాగాలా వద్దా అనేది ఉంటుంది. ఉదహారణకి ఫైబర్ అనేది సహజంగానే నీరు తాగేలా చేస్తుంది. సలాడ్ తీసుకున్న తర్వాత అందుకే ఎక్కువ దాహం వేస్తుంది. ప్రోటీన్లు అధికంగా ఉండే ఫుడ్ తీసుకున్నప్పుడు నీటిని తాగడం తగ్గించండి. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుపెట్టుకోవాల్సిందే.

**ఏ నీరు తాగాలంటే..** దీంతోపాటు, భోజనానికి ముందు, భోజనం సమయంలో తాగే నీటి రకం ముఖ్యమైందే. ఆల్కలీన్ వాటర్ తాగితే ఆ వాటర్ మీ పొట్టలోని ఆమ్లాలను బలంగా మారేలా చేస్తుంది. అదే విధంగా యాపిల్ సైడర్ వెనిగర్ లాంటి ఆమ్ల నీటిని తాగడం వల్ల జీర్ణ క్రియ మెరుగవుతుంది. మరో విషయం ఏంటంటే మీరు నీరు తాగడం, తాగకపోవడం వంటివి కూడా మీ శరీర తత్వంపై ఆధారపడి ఉంటుంది. మీరు గమనించి మీకు సరిపోయేది చేయండి. దాహం అనిపిస్తే తాగండి. సిప్ చేసి తినండి. అవసరం లేకపోతే దూరంగా ఉండడమే మంచిది.

**1.లేవగానే నీరు తాగడం..** మీ శరీరంలోని అవయవాలని క్లీన్ చేయడానికి నిద్ర లేవగానే ఓ గ్లాసు నీరు తాగండి. ఫస్ట్ మీల్ తీసుకోవడానికి ముందు నీరు కూడా మంచిది.

**2. భోజనానికి ముందు..** జీర్ణక్రియ సరిగ్గా ఉండేందుకు భోజనానికి 30 నిమిషాల ముందు ఓ గ్లాసు నీరు తాగాలి. భోజనానికి ముందు, తర్వాత తొందరగా నీరు తాగొద్దు. ఎందుకంటే నీరు జీర్ణ రసాలను పలుచన చేస్తుంది. ఆహారం తీసుకున్న ఓ గంట తర్వాత నీరు త్రాగితే శరీరం పోషకాలను గ్రహించేలా చేస్తుంది.

**3.స్నానానికి ముందు:** స్నానం చేసే ముందు నీరు మీ రక్తపోటుని తగ్గించడంలో సాయపడుతుంది. కాబట్టి ఓ గ్లాసు నీరు తాగండి.

# కాకరకాయ యూరిక్ యాసిడ్ సమస్యకు.. చెక్ పెడుతుందా..?



శరీరంలో కొలెస్ట్రాల్, బ్లడ్ షుగర్‌లా.. యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినా ఆరోగ్యానికి ప్రమాదకరం. యూరిక్ యాసిడ్ రక్తంలో కనిపించే వ్యర్థ పదార్థం. మనం తీసుకునే ఆహార పదార్థాల్లోని 'ప్యూరిన్' అనే రసాయనం విచ్ఛిన్నం చెందినప్పుడు యూరిక్ యాసిడ్ ఏర్పడుతుంది. ఇది ఎప్పటికప్పుడు మూత్రం ద్వారా బయటకు వెళ్తుంది. కిడ్నీలు యూరిక్ యాసిడ్‌ను సమర్థవంతంగా తొలగించలేనప్పుడు మన శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు చాలా వరకు పెరుగుతాయి. విసర్జన సరిగా జరగక పోయినప్పుడు యూరిక్ యాసిడ్ రక్తంలోనే నిలిచి పోతుంది. క్రమంగా ఇవి స్ఫటికాలుగా మారి కీళ్ళ, కీళ్ల చుట్టూ ఉండే కణజాలాల్లో పేరుకు పోతాయి. దీనినే 'హైపర్ యూరిసిమియా' అంటారు.

యూరిక్ యాసిడ్ ఎందుకు పెరుగుతుంది..?

శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరగడానికి చాలా కారణాలు ఉన్నాయి. ప్యూరిన్ అధికంగా ఉండే ఆహారం ఎక్కువగా తీసుకోవడం, అధిక బరువు, డయాబెటిస్, ఆల్కహాల్ ఎక్కువగా తీసుకోవడం వల్ల ఈ సమస్య వచ్చే అవకాశం ఉంది. యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగితే కీళ్ల నొప్పి, నడకలో ఇబ్బంది, వాపు , కీళ్ల పగుళ్లు వంటి లక్షణాలు కనిపిస్తాయి. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగితే అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. గౌట్, గుండె సమస్యలు, కిడ్నీ సమస్యలు, కడుపులో మంట, కిడ్నీలో రాళ్లు, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, డయాబెటిస్, హైపోథైరాయిడిజం, కొన్ని రకాల క్యాన్సర్, సోరియాసిస్ వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. సాధారణంగా పురుషులలలో పురుషులలో 3.4-7.0 mg వరకు యూరిక్ యాసిడ్, మహిళల్లో 2.4- 6.0 mg వరకు యూరిక్ యాసిడ్ ఉంటే ఎటువంటి ప్రమాదం ఉండదు.

యూరిక్ యాసిడ్ సమస్యను తగ్గించడానికి అనేక మందులు, చికిత్సుల ఉన్నాయి. కానీ, ఆయుర్వేదంలో కొన్ని నివారణల ద్వారా కూడా ఈ సమస్యను దూరం చేయవచ్చు. నోయిడాకు చెందిన ఆయుర్వేద వైద్యుడు కపిల్ త్యాగి యూరిక్ యాసిడ్‌ను తగ్గించడానికి ఓ సమర్థవంతమైన మార్గాన్ని సూచించారు.

**డాక్టర్ ఏమి చెప్పారు..** పోషకాహారం తీసుకుంటూ, జీవనశైలిలో మార్పుల చేసుకుంటే యూరిక్ యాసిడ్ సమస్యను తగ్గించుకోవచ్చని ఆయుర్వేద డాక్టర్ కపిల్ త్యాగి అన్నారు. వాత దోషం కారణంగా శరీరంలో యూరిక్ యాసిడ్ పెరుగుతుందని చెప్పారు. ప్యూరిన్ ఎక్కువగా ఉండే.. క్యాబేజీ, స్క్వాష్, బెల్ పెప్పర్స్, వంకాయ, బీన్స్, దుంపలను తినకూడదని ఆయుర్వేదం సిఫార్సు చేసింది. కాకరకాయ యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి సహాయపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

కాకరకాయలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని డాక్టర్ కపిల్ త్యాగి అన్నారు. కాకరకాయలో ఐరన్, మెగ్నీషియం, పొటాషియంతోపాటు విటమిన్ సీ ఉంటాయి. దీనిలో కాల్షియం, బీటా కెరోటిన్, పొటాషియం మెండుగా ఉంటుంది.

**అధ్యయనంలో తేలింది..** కొన్ని రోజులపాటు ఎలుకల గుంపుకు కాకర జ్యూస్ ఇచ్చారు. ఇది ఎలుకలలో యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించిందని పరిశోధకులు కనుగొన్నారు. కాకరకాయకు యూరిక్ యాసిడ్ తగ్గించే సామర్థ్యం ఉందని ఈ అధ్యయనంలో స్పష్టమైంది.

**ఈ పోషకాలు ఉన్నాయి..** ఒక కప్పు (94 గ్రా) కాకరకాయలో కేలరీలు: 20, పిండి పదార్థాలు: 4 గ్రా, ఫైబర్: 2 గ్రా, విటమిన్ సి: 93%, విటమిన్ ఎ 44%, ఫోలేట్ 17%, పొటాషియం 8%, జింక్ 5% , ఐరన్ 4% ఉంటుంది.

**ఎన్నో ప్రయోజనాలు..** కాకరకాయను తరచుగా తీసుకుంటే.. ఎన్నో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని నిపుణులు చెబుతున్నారు. కాకరకాయ తింటే.. రక్తంలో చక్కెర స్థాయిలు కంట్రోల్‌లో ఉంటాయి, క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది, చెడు కొలెస్ట్రాల్ కరుగుతుంది, బరువు తగ్గుతారు, కాలేయ పనితీరు మెరుగుపడుతుంది, చర్మ సమస్యలు దూరమవుతాయి, కడుపు సమస్యలు రావు.

**ఎలా తీసుకోవాలి..** కాకరకాయ వల్ల ఎక్కువ ప్రయోజనాలు పొందాలంటే రోజూ ఉదయాన్నే ఒక కప్పు కకర జ్యూస్ తాగాలని డాక్టర్ చెప్పారు. దీన్ని రకరకాలుగా వండుకుని, సూప్‌గా చేసుకుని మీ డైట్‌లో తీసుకోండి.

# ఆహారంలో మసాలా దినుసులు చేర్చడం వల్ల బరువు తగ్గుతారు



బరువు తగ్గడం మీ మనసులో ఉందా? అప్పుడు మీ పానీయాలు మరియు ఆహారంలో మసాలా దినుసులు జోడించడం వల్ల మీరు బరువు తగ్గుతారు. ఇది పొరపాటుగా అనిపించవచ్చు, కానీ మీ రోజువారీ ఆహారంలో ఈ మసాలా దినుసులను జోడించడం వల్ల ఎక్కువ శ్రమ లేకుండా బరువు తగ్గవచ్చు.

భారతదేశం శక్తివంతమైన ఔషధ ప్రయోజనాలతో నిండిన సుగంధ ద్రవ్యాలకు ప్రసిద్ధి చెందింది. మీ ఆహారంలో కొన్ని మసాలా దినుసులు జోడించడం వలన మీ జీవక్రియ రేటును వేగవంతం చేయవచ్చు మరియు మీరు కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. వాస్తవానికి, మసాలా దినుసులను సరైన మార్గంలో జోడించడం వల్ల మీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చు మరియు మీ ఊబకాయం ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

ఏలకులు అత్యంత రుచికరమైన భారతీయ మసాలా ఏలకులు, ఇది మెలటోనిన్ అనే పదార్థంతో నిండి ఉంటుంది, ఇది జీవక్రియ రేటును పెంచడంలో సహాయపడుతుంది. అధిక జీవక్రియ రేటు కొవ్వును కాల్చడానికి సహాయపడుతుంది మరియు బరువు తగ్గించే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. మీరు తేలికగా బరువు తగ్గడానికి ఓట్ మీల్‌లో ఒక సాధారణ టీ, డిటాక్స్ వాటర్ లేదా యాలకుల పొడిని జోడించవచ్చు.

మెంతి మెంతులు ఒక సాధారణ వంటగది మసాలా, ఇది మధుమేహాన్ని నిర్వహించడంలో సహాయపడుతుంది, ఇది సహజంగా ఆకలిని నియంత్రిస్తుంది మరియు ఇన్సులిన్ స్థాయిలను నిర్వహించగలదు. మెంతులు కలిపిన నీరు, టీ లేదా ఈ సాధారణ మసాలాను మీ సూప్‌లు మరియు బ్రోత్‌లకు జోడించడం వల్ల బొడ్డు కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ మసాలాలో ఫైబర్ అధికంగా ఉంటుంది మరియు సంతృప్తిని అందించడం ద్వారా కేలరీల తీసుకోవడం తగ్గించడంలో సహాయపడుతుంది.

మిరియాలు మీ ఆహారంలో లేదా టీలు, సూప్‌లు మరియు సలాడ్‌లలో నల్ల మిరియాలను జోడించడం వల్ల మీ జీవక్రియను పెంచుతుంది మరియు శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. నల్ల మిరియాలులోని ఫైటోన్యూట్రియెంట్లు అదనపు కొవ్వును బయటకు పంపి సహజంగా జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. అంతే కాకుండా, మీ టీలో ఎండుమిర్చి చేర్చడం వల్ల జలుబు మరియు దగ్గు వంటి సీజనల్ వ్యాధులను నివారించవచ్చు.

సోంపు ఈ సాంప్రదాయ వంటగది మసాలా దినుసులు సాధారణంగా దాని అద్భుతమైన జీర్ణ లక్షణాల కారణంగా భోజనం తర్వాత వినియోగిస్తారు. మీ రెగ్యులర్ టీలో ఒక టీస్పూన్ సోంపుని జోడించడం వల్ల టాక్సిన్స్ బయటకు వెళ్లి మీ మెటబాలిక్ రేటును వేగవంతం చేస్తుంది, ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, దాని రిచ్ యాంటీఆక్సిడెంట్ లక్షణాలు దెబ్బతిన్న కణాలను రిపేర్ చేయడం ద్వారా ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడం ద్వారా మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

దాల్చిన చెక్క వేడి దాల్చిన చెక్క టీ తయారు చేయడం నుండి సూప్‌లు లేదా సలాడ్‌లకు దాల్చినచెక్కను జోడించండి. ఈ సాధారణ వంటగది మసాలా దాని తీపి రుచి మరియు అన్యదేశ రుచికి ప్రసిద్ధి చెందింది. యాంటీఆక్సిడెంట్లు మరియు వైద్యం చేసే లక్షణాలతో నిండిన ఈ మసాలా శరీరంలో మంటను తగ్గిస్తుంది మరియు జీవక్రియ రేటును వేగవంతం చేస్తుంది, ఇది బరువు తగ్గడంలో మరింత సహాయపడుతుంది. అదనంగా, ఈ మసాలాను మీ టీలు, కూరలు మరియు భోజనాలకు జోడించడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీని నిర్వహించడంలో మరియు ట్రైగ్లిజరైడ్‌లను తగ్గించడంలో సహాయపడుతుంది, ఇది దీర్ఘకాలంలో మధుమేహాన్ని తగ్గించడంలో మరియు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

# ఈ పండు తింటే కొలెస్ట్రాల్ సమస్య ఉండదు



హై కొలెస్ట్రాల్ చాలా ప్రమాదకరం. గుండె వ్యాధులకు దారి తీస్తుంది. ప్రకృతిలో లభించే కొన్ని పండ్లు తింటే కొలెస్ట్రాల్ తగ్గించడమే కాకుండా..గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు..

మనిషి శరీరంలో లో డెన్సిటీ పొప్రోటీన్ అధిక మోతాదులో ఉంటే గుండె పోటు ముప్పు పెరుగుతుంది. దీన్ని నియంత్రించాలంటే ఆహారపు అలవాట్లు మారాలి. డైట్ సరిగ్గా ఉండాలి. కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచడం పెద్ద కష్టమేమీ కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు. కొన్ని రకాల పండ్లు తినడం ద్వారా కొలెస్ట్రాల్ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.

కొలెస్ట్రాల్ పెరగడానికి కారణం అనారోగ్యకరమైన ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్స్, ఆయిలీ, ఫ్రైడ్ పదార్థాలు, షుగర్ ఫుడ్స్ ,ఫైబర్ ఫుడ్స్ తక్కువగా తీసుకోవడం ప్రధాన కారణాలు. దాంతోపాటు స్మోకింగ్, మద్యం సేవనం, ఎక్సర్‌సైజ్ లేకపోవడం, అధిక రక్తపోటు, డయాబెటిస్ కూడా ఇతర కారణాలుగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కొలెస్ట్రాల్ తగ్గించేందుకు కొన్ని రకాల పండ్లను డైట్‌లో భాగంగా చేసుకోవాలి. ముఖ్యంగా విటమిన్స్, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండే పదార్థాలు తీసుకోవాలి.

వాస్తవానికి పుల్లటి పండ్లలో విటమిన్ సి, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇవి హానికారకమైన ఎల్‌డీఎల్‌ను తగ్గిం చేందుకు దోహదపడతాయి. అదే సమయంలో హెల్తీ కొలెస్ట్రాల్ పెంచుతాయి. విటమిన్ సి అనేది హార్ట్ డిసీజ్, బ్లడ్ ప్రెషర్ ముప్పును తగ్గిస్తాయి.

అవకాడోలో మోనో శాచ్యురేటెడ్ , పాలీ అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాట్ ఉంటుంది. ఈ రెండూ గుండెకు చాలా ప్రయోజనకరం. అవకాడో అనేది హై డెన్సిటీ పొప్రొటీన్, లోడెన్సిటీ లిపొప్రొటీన్ కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను బ్యాలెన్స్ చేస్తుంది.

నేరేడు పండులో ఫైటోన్యూట్రియంట్స్ ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉపయోగపడతాయి. నేరేడుపండ్లను ఏదో రూపంలో డైట్‌లో భాగంగా చేసుకుంటే.. శరీరంలో హెల్తీ కొలెస్ట్రాల్ పెంచుకోవచ్చు.

అరటిపండులో ఫైబర్, విటమిన్స్, మినరల్స్‌తో పాటు సుక్రోజ్, ఫ్రక్టోజ్, గ్లూకోజ్ పుష్కలంగా ఉంటుంది. అరటిపండు పొటాషియం, ఫైబర్‌లకు మంచి సోర్స్ ఫుడ్. ఫలితంగా కొలెస్ట్రాల్ , అధిక రక్తపోటు నియంత్రణలో ఉంటాయి.

కరిగే తత్వమున్న ఫైబర్ ఫుడ్స్ కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను తగ్గిస్తాయి. పండ్లలో ఇటువంటి ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఫైబర్ ఎక్కువగా ఉండే పండ్లలో యాపిల్ కీలకమైంది.

# మైదా పిండి బదులు వీటిని వాడితే చాలా మంచిది



మీరు బేకింగ్ ఐటెమ్స్ తినడానికి భయపడుతున్నారా.. వాటిని తింటే ఆరోగ్యానికి ఇబ్బందని టెన్షన్ పడుతున్నారా. ఎందుకంటే ఇందులో ఉపయోగించే మైదా వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయనుకుంటున్నారా..

అవునండి.. బాదం ఆరోగ్యానికి చాలా మంచిది రోజూ వాటిని తినమని చెబుతున్నారు నిపుణులు. వీటిని తినడం వల్ల వాటిలోని పోషకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇందులో లో కార్బ్స్ ఉంటాయి. ఇది బేకింగ్‌కి మంచి ఆప్షన్ అని చెప్పొచ్చు. కీటో డిసర్ట్స్‌లో వీటిని మనం ఉపయోగించొచ్చు. చాలా మంది సెలబ్రిటీలు ఇలానే చేస్తున్నారు కూడా.

**కొబ్బరి..** కొబ్బరిలో ఎన్ని పోషకాలు ఉన్నాయో అందరికీ తెలుసు. కొబ్బరి పాలు చాలా మంది తీస్తుంటారు. ఆ తర్వాత మిగిలిన పదార్థాన్ని మనం మైదా బదులు వాడుకోవచ్చు. ఇది గొప్ప ఆప్షన్ అని చెప్పుకోవచ్చు.

**బక్‌వీట్..** బక్వీట్.. సూపర్ మార్కెట్‌లో దొరుకుతుంది. వీటినే కుట్టు అని కూడా చాలా చోట్ల అంటారు. వీటిని పిండిలా వాడుకోవచ్చు. దీనిని రోజూ తీసుకున్నా చాలా మంచిది.

**సోయా..** సోయాలో చాలా గొప్ప మూలకాలు ఉంటాయి. వీటిని రెగ్యులర్‌గా తీసుకోవడం చాలా మంచిది. ఇందులోని హెల్దీ ప్రాపర్టీస్ మన శరీరానికి మేలు చేస్తాయి. పోషకాలతో నిండి ఉన్న ఈ పిండిని మనం కేక్స్ తయారీల్లో వాడొచ్చు.

**రాగి పిండి..** రాగుల గురించి మనకు తెలియనిది కాదు. ఇందులోని గొప్ప మూలకాలన్నీ మన ఎముకల బలానికి చాలా ఉపయోగపడతాయి. ఈ పిండిని మనం కేక్స్, బిస్కెట్స్ తయారీలో వాడొచ్చు. దీని టేస్ట్ కూడా చాలా బాగుంటుంది.

**క్వినోవా..** క్వినోవాని మనం రెగ్యులర్‌గా తీసుకోవాలని చెబుతారు నిపుణులు. ఎందులోని గొప్ప మూలకాలు మనం పొందాలంటే మన వంటల్లో వీటిని యాడ్స్ చేసుకోవాల్సిందే. ఈ పిండి గ్లూటెన్ ఫ్రీ అవ్వడమే కాకుండా మంచి ఆరోగ్యాన్ని కూడా ఇస్తుంది.

**మైదా ఎందుకొద్దు..** పైన చెప్పిన వాటన్నింటితో పోలిస్తే, మైదా తక్కువ ధరలో అందరికీ ఈజీగా అందుతుంది. కానీ, ఈ పిండిలో ఎలాంటి హెల్త్ బెనిఫిట్స్ ఉండవు. గొప్ప పోషకాలు, ఫైబర్ అన్ని కూడా ప్రాసెసింగ్‌లోనే వెళ్ళిపోతాయి. సో.. ఈ పిండి బదులు పైన చెప్పిన హెల్దీ ఆప్షన్స్‌ని చూస్ చేసుకోవచ్చు.

# ఇవి ఖాళీ కడుపుతో తీసుకుంటే.. ప్రీ డయాబెటిస్ రివర్స్



'డయాబెటిస్' ఇది తీవ్రమైన సమస్య. డయాబెటిస్ ఒక్కసారి వస్తే.. దీన్ని కంట్రోల్ ఉంచుకోవడం తప్ప పూర్తిగా నయం కాదు. డయాబెటిస్ కారణంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. గుండె సమస్యలు, కిడ్నీ జబ్బులు, కంటి సమస్యలు, నరాల బలహీనత వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే, డయాబెటిస్ వచ్చిన తర్వాత తిప్పలు పడటం కంటే.. ఇది రాకుండా జాగ్రత్తపడటం మంచిది. షుగర్ పేషెంట్స్ ముందుగా 'ప్రీ డయాబెటిక్' దశను దాటే డయాబెటిక్‌గా మారుతారు. రక్తంలో చక్కెర స్థాయిలు నిర్దేశించిన విలువల కన్నా ఎక్కువగా ఉంటే డయాబెటిస్ అంటారు. అయితే మరీ ఎక్కువగా ఉండకుండా కొంచెం బార్డర్ లైన్‌లో ఉన్నా, లేదా కొద్దిగా ఎక్కువగా ఉన్నా దాన్ని ప్రీ డయాబెటిస్ అంటారు. పరగడుపున షుగర్ టెస్టు చేయించుకుంటే ఆ లెవల్ 80 నుంచి 110 మధ్య రావాలి. కానీ 111 నుంచి 120 వరకు వస్తే దాన్ని డయాబెటిస్ అని అనరు. షుగర్ లెవల్ బోర్డర్‌లో ప్రీ డయాబెటిస్ అంటారు. అదే చాలా ఎక్కువగా వస్తే దాన్ని డయాబెటిస్ అంటారు. ఈ స్టేజిలో చాలా జాగ్రత్తగా ఉండాలి. నిర్లక్ష్యం చేస్తే అది డయాబెటిస్‌కు దారి తీసే అవకాశం ఉంటుంది. చైనా ఆరోగ్య సంస్థ FHS నివేదిక ప్రకారం, ఆకలిగా ఉన్నప్పుడు.. రక్తంలో గ్లూకోజ్ 5.6-6.9 mmol/L ఉంటే, తిన్న రెండు గంటల తర్వాత రక్తంలో గ్లూకోజ్ 7.8-11.0 mmol/L ఉంటే ప్రీ డయాబెటిస్ స్టేజ్‌లో ఉన్నారని అర్థం. ఈ స్టేజ్‌లో మంచి ఆహార అలవాట్లు లేకపోయినా, వ్యాయామం చేయకపోయినా.. రాబోయే పదేళ్లలో టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఉందని FHS స్పష్టం హెచ్చరించింది.

ఆయుర్వేదంలోని ఔషదాలు ప్రీ-డయాబెటిస్‌ను రివర్స్ చేయడానికి సహాయపడతాయని ఆయుర్వేద వైద్యురాలు దీక్షా భావ్‌సార్ అన్నారు. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని కంట్రోల్‌లో ఉంచి, ప్రీ-డయాబెటిస్‌ను రివర్స్ చేస్తాయని తెలిపారు.

మెంతులు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. మెంతుల్లో ఫోలిక్ యాసిడ్, రైబోఫ్లావిన్, రాగి, పొటాషియం, క్యాల్షియం, ఐరన్, మాంగనీసుతో పాటు ఎ, బి6, సి, కె విటమిన్ల వంటి పోషకాలెన్నో ఉంటాయి. గ్లూకోజు మోతాదులు తగ్గటానికీ మెంతులు ఉపయోగపడతాయని భారతీయ వైద్య పరిశోధన మండలి నివేదిక పేర్కొంటోంది. మెంతులలో నీటిలో కరిగే ఫైబర్ మెండుగా ఉంటుంది. మెంతుల్లో 4-హైడ్రాక్సీల్యూసిన్ అనే అమైనో ఆల్కనాయిక్ యాసిడ్ ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచటంతో పాటు కణాలు ఇన్సులిన్‌ను స్వీకరించేలా చూస్తుంది. మెంతులు రోజూ తీసుకుంటే కొలెస్ట్రాల్ ట్రైగ్లిజరైడ్‌లు కూడా తగ్గుతాయి. ప్రీ-డయాబెటిస్ ఉంటే రాత్రిపూట మెంతులను నానబెట్టి తెల్లారి వాటిని వడగట్టి, నీళ్లు తాగొచ్చు. లేకపోతే వేడి నీటిలో 10 నిమిషాల సేపు మెంతులను వేసి మూతపెట్టి, తర్వాత వడగట్టి తాగొచ్చు. కావాలంటే మెంతులతో టీ కూడా కాచుకొని తీసుకోవచ్చు.

**మిరియాలు..** ప్రపంచవ్యాప్తంగా వాడే ముఖ్యమైన మసాలా దినుసుల్లో మిరియాలది కీలక పాత్ర. ఇది వంటకాలకు ఘాటైన రుచిని ఇస్తుంది. మిరియాలు ఇన్సులిన్ అసహనం, రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడంలో సహాయపడతాయి. మిరియాల్లో యాంటీబ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. మిరియాలలో ఉండే 'పైపెరిన్' రక్తంలో చక్కర స్థాయిలను కంట్రోల్ ఉంచుతాయి.శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను పైపరైన్ నిర్వీర్యం చేస్తుంది. ఫ్రీ ర్యాడికల్స్ కారణంగానూ డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంది. ప్రీ-డయాబెటిస్ ఉంటే ఒక నల్ల మిరియం పొడి చేసి, చిటికెడు పసుపులో కలిపి ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే మంచిది. ఈ పొడిని పాలల్లో వేసి తీసుకున్నా మేలు జరుగుతుంది.

**దాల్చిన చెక్క..** దాల్చిన చెక్కను మాంసాహార వంటల్లో రుచికి, సువాసనకు కచ్చితంగా వాడుతూ ఉంటారు. ఇది ఇన్సులిన్ అసహనాన్ని తగ్గిస్తుంది, భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్పైక్‌లను తగ్గించడంలో సహాయపడుతుంది. దీంట్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇందులోని హైడ్రాక్సీసినమాల్డిహైడ్ అనే కాంపౌండ్ రక్తంలోని హానికారక కొవ్వుల్ని తగ్గిస్తుంది. దాల్చిన చెక్క శరీరంలోని చెడు కొవ్వుల్ని క్రమంగా తగ్గించి, మంచి కొవ్వుల స్థాయిని పెంచుతుంది. అదనపు కొవ్వు మరియు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో కూడా ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఒక పాత్రలో కప్పు నీరు తీసుకుని దాన్ని మరిగించాలి. మరుగుతున్న నీటిలో రెండు చిన్న దాల్చిన చెక్క ముక్కల్ని వేసి మళ్లీ మరిగించాలి. కాసేపటి తర్వాత స్టవ్ ఆఫ్ చేసి ఈ మిశ్రమాన్ని వడకట్టాలి. ఇలా తయారుచేసిన మిశ్రమాన్ని రోజూ పరగడుపున తీసుకుంటే మంచిది.

**పసుపు, ఉసిరి..** పసుపు, ఉసిరి కాంబినేషన్ ప్రీ-డయాబెటిస్ త్వరగా రివర్స్ చేయడానికి సమర్థవంతంగా పని చేస్తుంది. ఆయుర్వేద వైద్యులు ఎక్కువగా ఈ కాంబినేషన్ సూచిస్తారు. ఇది చక్కెర స్థాయిని సమతుల్యం. ఈ కాంబినేషన్ శరీరంలోని అదనపు కఫాన్ని తగ్గిస్తుంది, రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ప్రీ-డయాబెటిస్ స్టేజ్‌లో ఉంటే.. ఉసిరి పొడిలో సమాన పరిమాణంలో పసుపు కలిపి, ఖాళీ కడుపుతో 1 టీస్పూన్ తీసుకోండి. ఈ పొడి రక్తంలో చక్కెర స్థాయని తగ్గిస్తుంది.

# నేటినుంచి బునియాది శిక్షా అభియాన్

విజయనగరం: ప్రాథమిక విద్యను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా, జిల్లాలో మరో వినూత్న కార్యక్రమం బునియాది శిక్షా అభియాన్ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో భాగంగా, పాఠశాలలను సక్రమంగా నిర్వహించుకోవడం, పేరెంట్స్ కమిటీల విధులు, అందుబాటులో ఉన్న వనరులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవడం తదితర అంశాలపై విద్యార్థులకు, తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించనున్నారు. నీతి అయోగ్ ఆకాంక్షిత జిల్లా కావడంతో, విజయనగరం జిల్లాను ఎంపిక చేశారు. నీతి అయోగ్ భాగస్వామ్యంతో, పిరామల్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. దీనికోసం జామి, గంట్యాడ, విజయనగరం మండలాలు, విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని పిల్లల సంఖ్య ఎక్కువగా ఉన్న వంద ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. రోజుకో పాఠశాల చొప్పున వంద రోజులపాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దీనిలో భాగంగా పిరామల్ ఫౌండేషన్ వలంటీర్లు ఆయా పాఠశాలలకు వెళ్లి, తరగతులను, గ్రంథాలయాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించుకోవడం, మాక్ పార్లమెంట్, తరచూ తల్లితండ్రుల సమావేశాలు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రభుత్వం టివిలు, ఎంతో విలువైన డిజిటల్ బోధనాంశాలను ఇప్పటికే అందుబాటులో ఉంచింది. అయితే అవగాహనా లోపం వల్ల వాటిని ప్రస్తుతం సక్రమంగా వినియోగించుకోలేక పోతున్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా వినియోగించుకొని, విద్యార్థులకు వివిధ అంశాలపై ఎలా అవగాహన కల్పించాలో వివరిస్తారు. ఈ బునియాది శిక్షా అభియాన్ కార్యక్రమాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది.

# అంగన్వాడీ లకు కనీస వేతనం 26000 అమలు చేయాలి.



పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్): అంగన్వాడీలకు కనీస వేతనం 26,000 అమలు చేయాలని సి ఐ టు యు జిల్లా అధ్యక్షులు గొర్లె వెంకటరమణ, అంగన్వాడీ యూనియన్ నాయుకులు ఇందిరా డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో సుప్రీంకోర్టు అంగన్వాడీల గ్రాడ్యుయేట్ అమలు చేయాలని ఇచ్చిన తీర్పును దేశమంతా అమలు చేయాలని మరియు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని సెప్టెంబర్ 20వ తేదీ జరిగే కలెక్టరేట్ ధర్నా కార్యక్రమంలో పాల్గొంటామని తెలియజేస్తూ పార్వతీపురం ప్రాజెక్టు ఇన్చార్జి సిడిపిఓ కి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సిఐటి జిల్లా అధ్యక్షులు జి వెంకటరమణ అంగన్వాడి యూనియన్ నాయకులు ఇందిరా గౌరమ్మ లక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కి రిటైర్ మెంట్ వయసు 62 సం. చేయాలనీ, అంగన్వాడీ నిర్వహణ కు సెల్ ఫోన్ పంపిణీ చేయాలనీ అన్నారు.వై ఎస్ ఆర్ సంపూర్ణ పోషణ మెనూ నిధులు పెంచాలని, రిటైర్ మెంట్ బెనిఫిట్ 5లక్షలు ఇచ్చిన సగం జీతం పెన్షన్ ఇవ్వాలన్నారు.2017నుంచి పెండింగు లో ఉన్నా టి ఎ బిల్లులు చెల్లించాలని, నెలకు ఒక గ్యాస్ బండ ఇవ్వాలని,వేతనం తో కూడిన మెడికల్ లీవ్లు ఇవ్వాలని, అంగన్వాడీ సెంటర్లను ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయరాదని, కాళీ గా ఉన్న వర్కర్స్, హెల్పేర్ పోస్ట్ లను భర్తీ చేయాలనీ డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ కార్యకర్తలు లు హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం పాదయాత్రలో వీచిన మద్యం పవనాలు



పిఠాపురం, (విశాఖ సమాచారమ్): రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలు తెలుసుకోవటానికి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తన శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ప్రజల్లో పార్టీని బలోపేతం చేయుటకు కృషి చేస్తున్నారు. ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని ఎక్కడ తప్పు జరిగినా కూడా ప్రశ్నించాలని అక్కడ న్యాయం జరిగే వరకు కూడా పోరాటాన్ని ఆపొద్దు అని పదే పదే పవన్ కళ్యాణ్ సభలోని ప్రశంగించడం మనం వింటూనే వుంటాం. ఆయన ప్రసంగానికి యువకుల ఆకర్షితులవుతుంటారు. ఓవైపు పార్టీకి మైలేజ్ పెరుగుతున్న తరుణంలో పార్టీ పరువును భ్రష్టు పట్టించేలా ప్రవర్తించిన తీరు పిఠాపురం నియోజకవర్గం లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఆదివారం పిఠాపురం నుండి అన్నవరం పుణ్యక్షేత్రంనకు పవన్ కోసం పాదయాత్ర పేరుతో కందరాడ గ్రామం నుండి పాదయాత్ర మొదలయ్యింది. ఈ నేపథ్యంలో పాదయాత్ర జరుగు మార్గమధ్యలో కొందరు కార్యకర్తలు మద్యం సీసాలతో దర్శనం ఇవ్వడం పలువురి అభిమానులను కలచివేసింది. పవన్ కళ్యాణ్ విలువలను పార్టీని ప్రశ్నించే విధంగా ఈ దృశ్యాలు కనబడటం జనసేన పార్టీ కి ఎంతవరకు మేలు జరిగునో పాదయాత్ర నిర్వహిస్తున్న నిర్వాహకులకే తెలియాలని ప్రజలు వాపోతున్నారు. పవన్ కళ్యాణ్ ముఖ చిత్రాంగల టీ షర్ట్ వేసుకుని వేసుకుని ఒక చేతితో మద్యం సీసా పట్టుకోవడాన్ని చూసిన వారికి ఇబ్బందికరంగా ఉందని పాదయాత్రలోనే కొందరు చెవులు కొరుక్కున్నారు.

# ఛాయరాజ్ ఆలోచన విధానాన్ని కొనసాగించడమే నిజమైన నివాళి: కొప్పల భానుమూర్తి



ఛాయరాజ్ రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, వర్తమాన సామాజిక సంక్షోభాలకి పరిష్కారాలు ఛాయరాజ్ కవిత్వంలో లభిస్తాయని, నేటి తరానికి ఛాయరాజ్ ను పరిచయం చేయాల్సిన బాధ్యత మనందరం మీద ఉన్నదని, జనసాహితి జిల్లా అధ్యక్షులు మరియు ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి పేర్కొన్నారు. ప్రజా సాహిత్య , సాంస్కృతి కోద్యమ కవి ఛాయరాజ్ 9వ వర్ధంతి ఆదివారం శ్రీకాకుళం నగరంలో జరిగిన సభకు ఆయన అధ్యక్షత వహించారు. కవి ఛాయరాజ్ గతి తార్కిక ఆలోచన విధానాన్ని కొనసాగించడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. తాను కథలు రాయటానికి, నేర్చుకోవడంలో ఛాయరాజ్ గారి ఆధ్వర్యంలో జరిగిందని పేర్కొన్నారు. రచయిత చింతాడ తిరుమలరావు ఛాయారాజ్ గారి సాహిత్య సమీక్ష చేస్తూ ఛాయారాజ్ గారితో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తొలెరుక కావ్యాన్ని జన సాహితీ ప్రధాన కార్యదర్శి పి మోహనరావు సమీక్ష చేశారు. ఛాయరాజ్ ప్రజా గ్రంథాలయ కో కన్వీనర్ సదాశివుని శంకర్రావు దుఖేరు కావ్యాన్ని సమీక్ష చేస్తూ ఛాయరాజ్ గారి దార్శనికత వివరించారు. వర్తమాన సామాజిక సంక్షోభంలో - రచయితలు, మేధావులు ఎటువైపు అనే అంశంపై ఐ టి ఆర్ వి శివాజీ ఛాయరాజ్ స్మారక ఉపన్యాసాన్ని చేస్తూ ప్రస్తుత సంక్షోభ సమయంలో మేధావులు రచయితలు తమ బాధ్యతను జాగ్రత్తగా నిర్వహించాల్సిన పరిస్థితి ఉన్నదని, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యొక్క మరో రూపాన్ని మనం ఛాయరాజ్ కోణంలో దర్శించాలని, పేర్కొన్నారు. ప్రస్తుతం శ్రామికులు, రైతులు విద్యార్థులు, మహిళలు సంక్షోభంలో ఉన్నారని, అప్రజాస్వామిక విధానాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, సామాన్యులు సంక్షోభంలోకి నెట్టివేయబడుతున్నారని, రచయితలు మేధావులు ఏకమై ప్రజలకు పరిస్థితిని అవగాహన అయ్యేవిధంగా పనిచేయాలని, ప్రజలను సమాయత్త పరిచాల్సిన రాజీ లేని బాధ్యత రచయితలు కళాకారులు మేధావులపై ఉన్నదని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు ఛాయరాజ్ గారితో తమకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సామాజిక కవి ఛాయరాజ్ కుమార్తె ఆగ్నేయ, అల్లుడు మల్ల పద్మనాభ రావు మాట్లాడుతూ ఛాయరాజ్ గారి కుమార్తెగా పుట్టడానికి గర్విస్తున్నానని ఉద్వేగ భరితంగా మాట్లాడారు. ఛాయరాజ్ స్మృతి గీతాన్ని పి మోహనరావు బృందం ఆలపించారు. వర్తమాన కవి కంచరాన భుజంగరావు ఛాయరాజ్ శ్రీకాకుళం కావ్య నుండి కొన్ని ఖండికలను ఆహూతులకు వినిపించారు. ఛాయరాజ్ ప్రజా గ్రంథాలయ కన్వీనర్ చాపలి శ్రీనివాస్ ఆహ్వానం పలుకగా దాసరి రామ్మోహనరావు వందన సమర్పణ చేశారు. సమావేశంలో ప్రజాసాహితి నాగరాజు, కె ఉదయకిరణ్, దాసరి రామ్మోహనరావు, కొంక్యాన వేణుగోపాల్, వి నవీన్ కుమార్, కాళీపట్నం సుబ్బారావు, రంగారావు భాగవతార్, టి ఎస్ ఆర్ ఆచార్యులు, కె గోవింద రావు, మొయిద హనుమంత రావు, సాహిత్య అభిమానులు, మేధావులు రచయితలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు సీబీఐకి అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది



అమరావతి: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసులో దాఖలైన పిటీషన్లను దేశ అత్యున్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఇవ్వాళ దీనిపై విచారణ చేపట్టింది. ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేయాలంటూ వివేకా కుమార్తె డాక్టర్ సునీత ఇదివరకే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దర్యాప్తును పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు. కేసును దర్యాప్తు చేస్తోన్న సీబీఐ అధికారులపై నిందితులు కేసులు నమోదు చేస్తోన్నారని పేర్కొన్నారు.

సుప్రీంలో పిటీషన్.. వైఎస్ వివేకా హత్యకేసుపై విచారణ ఆశించిన వేగంగా కొనసాగట్లేదని సునీత సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసుపై దర్యాప్తును మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. ఇందులో ప్రతివాదులుగా ఏపీ ప్రభుత్వం, సీబీఐ, డీజీపీలను చేర్చారు. ఈ పిటీషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ కృష్ణమురారితో కూడిన ధర్మాసనం ఇవ్వాళ విచారణ చేపట్టింది. కేసు వివరాలను అడిగి తెలుసుకుంది.

అక్టోబర్ 14కు వాయిదా.. అనంతరం ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీబీఐ అధికారులకు నోటీసులను జారీ చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 14వ తేదీకి వాయిదా వేసింది. 2019 మార్చి 15వ తేదీన వివేకానంద రెడ్డి పులివెందులలోని తన ఇంట్లో దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటన చోటు చేసుకుని మూడు సంవత్సరాలైనప్పటికీ దర్యాప్తు ముందుకు సాగట్లేదని, అసలు హంతకులు ఎవరనేది తెలియరావట్లేదని సునీత చెబుతున్నారు.

వేగంగా కొనసాగించేలా.. దర్యాప్తు వేగవంతం చేయడంలో భాగంగా ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వైఎస్ వివేకా హత్యకేసుపై సీబీఐ దర్యాప్తు సాగిస్తోంది. ఏపీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ కేసును సీబీఐ అధికారులు స్వీకరించారు. కొన్ని సందర్భాల్లో సీబీఐ అధికారులపైనే కేసులు నమోదవుతోన్నాయని, విచారణ ఆశించిన స్థాయిలో వేగంగా కొనసాగట్లేదని సునీత చెబుతున్నారు. వివేకా హత్య జరిగినప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం అప్పట్లో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.

ఛార్జ్‌షీట్.. సిట్ కూడా దీన్ని ఛేదించలేకపోయింది. దీనితో వివేకా హత్యకేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ సునీత ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. సునీత పిటిషన్‌ను విచారించిన హైకోర్టు 2020 మార్చి 11వ తేదీన సీబీఐకి దీన్ని అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. 2020 జులై 18న కడపలో విచారణ ప్రారంభించిన సీబీఐ అధికారులు ఇప్పటి వరకు 246 మంది సాక్షులను విచారించారు. ఎర్ర గంగిరెడ్డి, సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిపై ఛార్జిషీట్ దాఖలు చేశారు.

# ఏడాది కాలంగా పోరాడుతున్న 65మంది జిజిహెచ్ ఆప్కోస్ ఉద్యోగులు




కాకినాడ, (విశాఖ సమాచారమ్): కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి లో నక్షత్ర ఏజెన్సీ ద్వారా నియమించబడి తదుపరి ఆప్కోస్ పరిధిలోకి మార్చబడి సేవలు అందించిన ఉద్యోగులను అక్రమంగా తొలగించారని , విధుల్లోకి తీసుకోవాలని చేస్తున్న పోరాటం సోమవారం నాటికి 365 వ రోజుకి చేరుకుంది.

ఉద్యోగుల ఉద్యమం ఏడాది పూర్తయిన సందర్భంగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆప్కోస్ ఉద్యోగుల నాయకులు గంగాధర్, అరుణ లు మాట్లాడుతూ కాకినాడ జిజిహెచ్ లో 65 మంది తొలగించి , తమ కుటుంబాలను రోడ్డున పడేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు సూపరింటెండెంట్ గా ఉన్న డా. రావూరి మహాలక్ష్మి, డిఎంఈ గా ఉన్న డా. మానుకొండ రాఘవేంద్రరావు లు తమకు చాలా అన్యాయం చేసారని పేర్కొన్నారు. ఆప్కోస్ లో తమ పేర్లు నమోదు అవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాల జాబితాల నుండి తమ కుటుంబ సభ్యుల పేర్లు కూడా తొలగించారని తెలిపారు. జిజిహెచ్ లో తొలగించిన ఆప్కోస్ ఉద్యోగులందరినీ తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ కాకినాడ జిజిహెచ్ లో 2021 సెప్టెంబర్ నెలలో 6 వ తేదీన హఠాత్తుగా 65 మంది ఉద్యోగులను తొలగించడం చాలా అన్యాయమన్నారు. వారు నక్షత్ర ఏజెన్సీ ద్వారా నియమించబడినా ఆ ఏజెన్సీ కాలపరిమితి ముగిసాక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆప్కోస్ లో ఈ ఉద్యోగులను చేర్చి ఐ.డి. నంబర్స్ కూడా ఇచ్చారన్నారు. అయినా విధులకు దూరం చేసారని ఆందోళన వ్యక్తం చేశారు. గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులను కూడా జిజిహెచ్ మరియు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఖాతరు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిజిహెచ్ ఆప్కోస్ ఉద్యోగులు 65 మందిని, 2022 జూన్ 1 నుండి తొలగించిన వికాస అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 89 మందిని విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో ఏడాది కాలంగా పోరాడిన వారు ఎంతకాలమైనా పోరాటానికి సిద్ధమని గమనించాలన్నారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి. స్వామినాయుడు, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు మంగళగిరి ఏసు, పుష్ప, తలుపులమ్మ, రవి , జిజిహెచ్ అవుట్ సోర్సింగ్ జెఎసి నాయకులు పిఎస్ రాయుడు, రమణ, నాని తదితరులు ఆప్కోస్ ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆప్కోస్ ఉద్యోగులు కొలు సీతారాం, ఏడుకొండలు, సత్యవతి, కె. చంద్రశేఖర్, ధనుంజయ, నాగభూషణం, శివ, అజీజ్, సూర్యనారాయణ, దయానంద, రమణ, దుర్గా లక్ష్మి, వినోద్, శ్రీను, లోవరాజు, మౌలాలి, గోవింద్, వసంత తదితరులు పాల్గొన్నారు...

# గర్భిణీ స్త్రీ మృతిపై విచారణ జరిపించాలి



పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్): గిరిజన గర్భిణీ స్త్రీ మూటక నిర్మల మృతి పై సమగ్రమైన విచారణ జరిపించాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు రంజిత్ కుమార్, సీతారాం, సాయి డిమాండ్ చేసారు.ఈమేరకు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రగిరి గిరిజన గర్భిణీ స్త్రీల వసతిగృహంలో ఉండే గిరిజన గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం, సమయానికి మెరుగైన వైద్యం అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్లే గర్భిణీ స్త్రీల వసతిగృహంలో ఉండే గుమ్మలక్ష్మీపురం మండలం చినగీసాడ గ్రామానికి చెందిన మూటక నిర్మల మృతి చెందిందని నాయకులు ఆరోపించారు. ఈ మృతి పై సమగ్రమైన విచారణ జరిపి, బాధ్యులైన వసతిగృహంలో భోజన నిర్వాహకులు, వైటీసీ మేనేజర్ లపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను నాయకులు పల్ల సురేష్, దుక్క సీతారాం, ఆరిక చంద్ర శేఖర్, పాలక రంజిత్ కుమార్, చెల్లూరు సీతారాం, చొక్కాపు మహేష్, కోలక గౌరమ్మ తదితరులు కోరారు.

# తోటపల్లి వెంకన్న ఆలయంలో అత్యవసర సమావేశం



పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్): తోటపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం ఇంఛార్జి ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ నగేష్ ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశం లో ఈ క్రింది నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.1.స్థానిక ఎమ్. ఎల్. ఏ.ను కలసి అభివృద్ధి కమిటీ ఏర్పాటుకు సహకరించాలని కోరడం,2. విరాళాలు సేకరించడం 3. గుడి నిర్మాణం భాధ్యతలు కమిటీ ద్వారా చేయించడం.4. బ్యాంక్ భవన నిర్మాణం మరమ్మతులు జరిపించడం 5. కూలిన భవనాలు తొలగించడం 6. దేవాలయ పునర్ వైభవానికి సంసిద్ధం. హాజరు అయిన వారు... డా. డి. పారి నాయుడు, సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబు,తోటపల్లి ఎమ్. పి. టీ. సి. సింహాచలం, సంతోషపు రం ఎమ్. పీ. టి. సి. శ్రీనివాసరావు , గిజబ సర్పంచ్ భాగ్యలక్ష్మి శంకర రావు, దేవస్థానం మాజీ ఛైర్మన్ గంగాధర రావు, వైసీపీ నాయకులు అంబటి గౌరు నాయుడు, వినాయక దేవాలయం ఛైర్మన్ తామాడ దుర్గారావు , మాజీ సర్పంచ్ పకీరు నాయుడు, మంచిపల్లి శ్రీరాములు, దేవాలయం కాంట్రాక్టర్ సింహాచలం దేవస్థానం సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్స్‌పైనా జరిగిన లైంగిక డాడీ అమానుషం



పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్): పల్నాడు జిల్లా మాచర్ల మండలం చెందిన లీలావతి ఆశా వర్కర్ ను నలుగురు దుండగులు లైంగిక దాడి జరిపి హత్య చేయడాన్ని పార్వతీపురం మన్యం జిల్లా సిఐటియ అధ్యక్షులు జి వెంకటరమణ తీవ్రంగా ఖండించారు మరియు అచ్యుతాపురం %హజ్జ% లో చేస్తున్న సీతానగరం మండలం రామవరం గ్రామానికి చెందిన అప్పలమ్మ అనే మహిళపై లైంగిక దాడి జరిపి చంపివేయడం అత్యంత దురదృష్టకరమని ,పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ లేకపోవడం లైంగిక వేధింపులు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయకపోవడం ఇట్లాంటి దారుణాలు రుజువు చేస్తున్నాయని సిఐటియు నాయకులు అన్నారు శ్రామిక మహిళా సంఘం నాయకులు వి ఇందిర మాట్లాడుతూ నిర్భయ కేసు నమోదు చేయాలి, దోషులను కఠినంగా శిక్షించాలి, 25 లక్షలు ఎక్స్ గ్రేషియోఇవ్వాలి,కుటుంబం లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.ఆశా లకు శ్రామిక మహిళలకు రక్షణ కల్పించాలి ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు మంగమ్మ చిన్నమ్మ కళ్యాణి పుణ్యవతి లక్ష్మి మరియు సిఐటియు సభ్యులు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 24 మంది పేద విద్యార్థులకు సైకిల్ పంపిణీ

పిఠాపురం, (విశాఖ సమాచారమ్): స్థానిక కత్తుల గూడెంలో బర్నింగ్ టూల్స్ మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో విద్యార్థి విద్యార్థినిలకు ఉచితంగా సైకిల్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిఠాపురం నియోజకవర్గ శాసనసభ్యులు పెండం దొరబాబు హాజరవి 24 మంది పేద విద్యార్థులకు సైకిల్ పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టిన పాస్టర్ ఎలిషాని అభినందించారు. భవిష్యత్తులో బర్నింగ్ టూల్స్ మినిస్ట్రీ ద్వారా జరిగే ఏ కార్యక్రమాలకైనా నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన అన్నారు. సంస్థ సభ్యులు కాళీ ఎలిషా మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలోని స్కూల్ కి వెళ్లే పేద విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించుటకు సంస్థ తరుపున సైకిల్ పంపిణీ చేయడం జరిగిందని దాదాపు 25 సంవత్సరముల నుంచి ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో కాళీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యారోగ్యశాఖ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ



**విజయనగరం:** వైద్యారోగ్యశాఖ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమయ్యింది. వైద్యారోగ్యశాఖ, వైద్య విధాన పరిషత్‌లో సుమారు 194 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి ఇటీవలే ధరఖాస్తులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. వీటిలో మెడికో సోషల్ కౌన్సిలర్ -1, ఫిజియో థెరపిస్ట్-2 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు, ఎంపిక కమిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి సోమవారం కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. కమిటీ మెంబర్ కన్వీనర్, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వి రమణకుమారి, సభ్యులైన వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ నాగభూషణరావు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ సభ్యత్వ దరఖాస్తుల సమర్పణకు నేడే ఆఖరు

**విజయనగరం:** విజయనగరం ప్రెస్ క్లబ్ లో సభ్యులుగా చేరేందుకు ఈ నెల 20 తేదీతో గడువు ముగియనుందని కావున ఇంకా దరఖాస్తులు అందజేయని మీడియా మిత్రులు మంగళవారం సాయంత్రం లోగా సమాచార పౌర సంబంధాల శాఖా కార్యాలయంలో అందజేయాలని డీపీఆర్వో, ప్రెస్ క్లబ్ తాత్కాలిక నిర్వహణా కమిటీ కన్వీనర్ డి. రమేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయనగరం జిల్లా కేంద్రంలో పని చేస్తూ, ఇక్కడ అక్రిడేషన్ కలిగి ఉన్న పాత్రికేయులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు మాత్రమే ప్రెస్ క్లబ్ లో సభ్యత్వం ఇవ్వనున్నట్లు కమిటీ నిర్ణయించిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులకు ఆధార్, అక్రిడేషన్, ప్రస్తుతం పని చేస్తున్న సంస్థ తాలూక ఐడీ కార్డు జెరాక్స్ కాపీలు, రెండు ఫోటోలను జత చేసి 20వ తేదీ సాయంత్రం లోగా తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వచ్చిన దరఖాస్తులను 21వ తేదీ నుంచి 25 వరకు అడహాక్ కమిటీ పరిశీలించి, 26వ తేదీ నుంచి సభ్యత్వాలను జారీ చేస్తుందని వివరించారు. అలాగే అక్రిడిటేషన్ కార్డు లేనివారికి కమిటీ తుది నిర్ణయం మేరకు సభ్యత్వాలు జారీ ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేశారు. దరఖాస్తు ఆమోదం పొందిన జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ లో సభ్యత్వం కోసం రూ.300 రుసుం చెల్లించవల్సి ఉంటుందని వివరించారు. అక్టోబరు 1వ తేదీ నుంచి సభ్యత్వ కార్డులను జారీ చేయనున్నట్లు డీపీఆర్వో పేర్కొన్నారు.

## ఆశపు అక్కమ్మ చారిటబుల్ ట్రస్ట్ లోగో ఆవిష్కరణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మేడా బుజ్జమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆశపు అక్కమ్మ చారిటబుల్ ట్రస్ట్ లోగో(బేనర్) ఆవిష్కృతమైంది. సెంచూరియన్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.యస్.యన్. రాజు, మేడా మస్తాన్ రెడ్డి, డా. మోపిదేవి విజయ గోపాల్ వేముల భాస్కరాచారి, డా.డి.వి. సూర్యా రావు, శ్రీమతి ఆలపాటి లక్ష్మి, పంతులు లలిత, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ బాదంగీర్ సాయి (ఏ.వి. వి.యస్.మూర్తి) బ్యానర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రస్టీ బాదంగీర్ సాయి మాట్లాడుతూ ఇకనుంచి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవాకార్యక్రమాల్ని కూడా చేపట్టనున్నామన్నారు.

## స్పందన అర్జీలను గడువులోపు పరిష్కారించాలి



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, గుడువులోపు పరిష్కారించాలని జిల్లా కలెక్టరు డా. కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లాస్థాయి ప్రజా విజ్ఞాపనల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్ లో నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ డా. కృతికా శుక్లా.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్ రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డీఎస్ సునీతలతో కలిసి ప్రజల నుంచి విజ్ఞాపనలను స్వీకరించి ఆయా శాఖల ద్వారా నిర్దిష్ట గడువులో పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో 336 అర్జీలు స్వీకరించారు. వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, పేదలందరికీ ఇళ్లు కింద ఇళ్ల మంజూరు, రెవెన్యూ సేవలు, సర్వే, పెన్షన్ తదితరాలపై అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఒకే అంశంపై దరఖాస్తులు మళ్లీమళ్లీ రాకుండా స్పష్టమైన సమాచారంతో అర్జీలను గడువులోపు పరిష్కరించాలని కలెక్టరు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా చెరువులకు అనుమతులు తప్పనిసరి

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో ఆక్వా చెరువుల అనుమతులకు మండల, డివిజన్ స్థాయి కమిటీల ఆమోదం తప్పనిసరని, ఆక్వా చెరువులకు అనుమతుల మంజూరులో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా క్షేత్రస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో మత్స్య శాఖ జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా.. మత్స్య, వ్యవసాయ, రెవెన్యూ, ఇరిగేషన్, పరిశ్రమలు, పొల్యూషన్, భూగర్భ జలాలు, అటవీ, జిల్లా పరిషత్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులతో కలిసి నిర్వహించారు. జేసీ ఎస్.ఇలక్కియ కూడా హాజరైన ఈ సమావేశంలో గత సమావేశంలో తీర్మానించిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలను జిల్లా మత్స్య శాఖ అధికారి పీవీ సత్యనారాయణ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేపల ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుబీ మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు పోషణ భద్రత కల్పించే ఉద్దేశంతో అమలవుతున్న ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకంపై విస్తృత అవగాహన కల్పించి, పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈ నేపథ్యంలో పీఎంఎంఎస్‌వై పథకానికి సంబంధించి ఇప్పటికే మత్స్యకార గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఐస్ బాక్స్‌తో కూడిన మోటార్ సైకిల్, త్రిచక్ర వాహనాల కోసం అధిక దరఖాస్తులు వచ్చాయన్నారు. నూతన ఆక్వా ఫారాల మంజూరుకు సంబంధించి మండల, డివిజన్ స్థాయి కమిటీ సమావేశాలలో సమన్వ శాఖల అధికారులు అన్ని అంశాలపై చర్చించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని కలెక్టరు తెలిపారు. జాతీయ హరిత ట్రిబ్యునల్



(ఎన్‌జీటీ) ఆదేశాల మేరకు జిల్లాలో సముద్రతీర ప్రాంతాల్లో అనుమతులు లేని ఆక్వా చెరువులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా మత్స్య శాఖ రూపొందించిన పీఎంఎంఎస్‌వై అవగాహన కరపత్రాలను కలెక్టరు.. అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో జెడ్‌పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, ఎఫ్‌డీవో డా. జి.గోపి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్ కుమార్, ఇరిగేషన్ ఈఈ కె.సుబ్బయ్య, పరిశ్రమల శాఖ జీఎం టి.మురళి, జిల్లా అటవీ అధికారి ఐవీకే రాజు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ టి.అశోక్, భూగర్భ జలాల డీడీ పి.రాధాకృష్ణ, కాకినాడ ఆర్‌డీవో బీవీ రమణ, జిల్లా ఆక్వా రైతు సంఘ అధ్యక్షులు సీహెచ్‌వీ సూర్యారావు, బి.వీరాస్వామి తదితరులు హాజరయ్యారు.

# స్పందన పరిష్కార ఫోటోలు అప్ లోడ్ చేయాలి



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** స్పందన వినతులు పరిష్కారంలో ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పష్టం చేశారు. స్పందనలో అందిన వినతులు పరిష్కారానికి సంబంధిత వ్యక్తులతో విధిగా సంప్రదించడం, క్షేత్ర స్థాయిలో సమస్యల పట్ల సందర్శించి ఫోటో అప్ లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. స్పందనకు వచ్చిన అర్జీల్లో పింఛన్లు, జగనన్న ఇంటి స్థలాలు, ఏనుగులు, పులుల బెడద నుండి రక్షణ తదితర అంశాలపై వినతులు అందాయి. వివరాలు క్రింద విధంగా ఉన్నాయి. కురుపాం మండలం దిబ్బాడ గ్రామంకు చెందిన ఏ. అప్పలనాయుడు తోటపల్లి ప్రాజెక్ట్ నిర్వాసిత ప్యాకేజీ మంజూరు చేయాలని కోరారు. పార్వతీపురం మండలం బందలపు గ్రామంకు చెందిన జి.సద్గుణప్రసాదరావు తమ కుమార్తెకు అమ్మ ఓడి రావడం లేదని, న్యాయం చేయాలని కోరారు. జియ్యమ్మ వలస మండలం చిన్న బుడ్డిడి గ్రామంకు చెందిన ఎం. రాజు సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని వినతి పత్రం సమర్పించారు. వీరఘట్టం మండలం రేగులపాడు గ్రామంకు చెందిన టి.సావిత్రమ్మ వితంతు పింఛను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్వతీపురం మండలం బాల గుడబ గ్రామంకు చెందిన ఎస్. గౌరమ్మ తన భూమి ఆక్రమణలకు గురైందని, న్యాయం చేయాలని కోరారు. సీతానగరం మండలం అప్పయ్యపేట గ్రామంకు చెందిన వై. సూర్యనారాయణ రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరారు. పార్వతీపురం నెయ్యల వీధికి చెందిన బి.ఫకీరు తమ కుమారుడి పింఛను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్వతిపురంలో సన్యాసి రావు మెమోరియల్ వద్ద ఆడిటోరియం నిర్మించాలని జి.వి.నాథ్ వినతి పత్రం సమర్పించారు. గరుగిబిల్లి మండలం ఉల్లిభద్ర గ్రామంకు చెందిన అనీల్ కుమార్ జగనన్న ఇంటి స్థలం ఇప్పించవలసిందిగా కోరారు.

స్పందన కార్యక్రమానికి మొత్తం 72 అర్జీలు అందాయి.

ఆనంతరం శుక్ర వారం నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన యువతకు నియామక పత్రాలను జిల్లా కలెక్టర్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకట రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి. జగన్నాథ రావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఏ. ఈశ్వర రావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై. సత్యం నాయుడు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం, జిల్లా విద్యా శాఖ అధికారి పి. బ్రహ్మాజీ రావు, జిల్లా వృత్తి విద్యా అధికారి డి.మంజుల వాణి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టి బాబు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయ గౌరీ, జిల్లా మలేరియా అధికారి కె. పైడి రాజు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఏ.లావణ్య, జిల్లా రవాణా అధికారి ఎం.శశి కుమార్, జిల్లా ప్రధాన అగ్ని మాపక అధికారి కె. శ్రీను బాబు, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె. రాజ కుమార్, క్రీడల చీఫ్ కోచ్ ఎస్. వేంకటేశ్వర రావు, జిల్లా రిజిస్ట్రార్ ఎం.ఎస్. కె. పూర్ణ చంద్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారి జె. శాంతీశ్వర రావు, జిల్లా ఖజానా అధికారి కవిటి మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

# వినతుల పరిష్కారం లో ఫోటో లను తప్పక అప్లోడ్ చేయాలి



**విజయనగరం:** సోమవారం కలెక్టరేట్ నందు నిర్వహించిన స్పందన కు ప్రజల నుండి 192 వినతులు అందాయి. వీటిలో వైద్య శాఖకు 26, డి.ఆర్.డి.ఏ కు 12, అందగా అత్యధికంగా రెవిన్యూ కు సంబంధించి 134, మాన్యువల్ గా 20 వినతులు అందాయి. ముఖ్యంగా సదరం, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, భూ సమస్యలు, గృహాల కోసం విజ్ఞప్తులు వచ్చాయి. ఈ వినతులను జిల్లా కలెక్టరు ఎ. సూర్య కుమారి, జె.సి మయూర్ అశోక్, డి.ఆర్.ఓ గణపతి రావు, ఉప కలెక్టర్లు సుదర్శన దొర, సూర్యనారాయణ, పద్మావతి స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అర్జీదారు లకు సమాధానం రాసేటప్పుడు సంబంధించిన ఫోటో ను కూడా అప్లోడ్ చేయాలని, సమస్య పరిష్కారానికి ముందు పరిష్కరించబడిన తర్వాత ఫోటో లను అప్లోడ్ చేయాలని ఆదేశించారు.

స్పందన లో విభిన్న ప్రతిభావంతులు , వయో వృద్దుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్ ను కలెక్టర్ , జె.సి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ పోస్టర్ నందు యూనిక్ డిజబిలిటీ ఐడెంటిఫికేషన్ కార్డు ఉపయోగాలు, శాఖ ద్వారా చేపడుతున్న ఇతర సంక్షేమ పథకాలు గురించి ముద్రించారు.

# అమ్మ విలువ

నా వయసు పిల్లలంతా ఎంత ఆనందంగా హాయిగా ఉంటున్నారో... ఛీ.. నాకే ఎందుకీ అవస్థలు.. అక్కడ ఆఫీస్ కెళితే ఆఫీస్ లోను అంతే.. ఇక్కడ ఇంటికొస్తే ఇక్కడా అంతే..అంది నా కూతురు కాస్త ఏడుపు.. కాస్త చిరాకూ నిండిన స్వరంతో..అప్పుడే స్కూల్ నుంచి వచ్చి అలసటగా మంచంమీద పడుకొంది.. నేను మేడ మీద బట్టలు ఆరేసావు కదా తడిసిపోతాయి... కిందికి తెచ్చుకోవాలి కదా అని కాస్త కోపంగా అన్నందుకు ...దాని సమాధానానికి నాకు మనస్సు చివుక్కుమంది ....వాళ్లందరికీ అమ్మ ఉందమ్మా నీకు లేదుకదా...అన్నాను నన్ను నేను సముదాయించుకొని... చేయి పట్టి అన్నీ నేర్పించాల్సిన వయసులో తల్లి చనిపోతే ఆ భాధ ఎవరితో చెప్పుకొన్నా తీరిపోనిది.సరయిన వయసులో నా కూతురు తల్లిని పోగొట్టుకొంది.. తోటి పిల్లలు సరదాగా కాలేజీలకు వెళుతూ చదువుకొంటూ ఉంటూ తాను మాత్రం వంట పని.. ఇంటి పనితోపాటు తల్లి మరణం ద్వారా వచ్చిన ఉద్యోగ బాధ్యతల్ని (నా భార్య ప్రభుత్వ ఉపాధ్యాయరాలు కావడంతో కారుణ్య నియామకాల్లో భాగంగా మా అమ్మాయికి ఇటీవలే ప్రభుత్వం అదే స్కూల్లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇచ్చింది)కూడా చక్కబెట్టుకోవాల్సి వస్తోంది.ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని ఆనంద పడే పరిస్థితి దానికి లేదు.తల్లి బతికుండగా ఏ పని చేయకుండా, ఏదీ నేర్చుకోకుండా గారాబంగా పెరిగిన నా బిడ్డ పడుతున్న అవస్థలు ఒక్కోసారి నన్ను కన్నీళ్లు పెట్టిస్తోంది.వెనకాసరా ఉండి చక్కబెట్టేవాళ్ళుంటే ఆ దారి వేరుగా ఉండేది..కానీ తానే ఇంటికి పెద్ద దిక్కుగా మారిన నా కూతురి పరిస్థితి బాధాకరమే..తల్లి లేక తల్లడిల్లే వాళ్ళకే ఆ భాధ తెలుస్తుంది తప్ప ఒకరికి చెప్పినా అర్థం అవదు..అప్పుడప్పుడు నాకనిపిస్తూ ఉంటుంది కొందరికి తెలిసీ తెలియని వయసులో తల్లులు పోతారు.. వాళ్ళకి అమ్మ రూపం కూడా తెలియదు.. మరికొందరికి అమ్మ రూపం తెలిసిన తర్వాత తల్లులు పోతారు... ఇది కష్టమే.. కానీ పదిహేడేళ్లు అమ్మ కొంగు నీడలో పెరిగి తల్లిని పోగొట్టుకొంటే.... దానికి తోడు కుటుంబ బాధ్యతల్ని కూడా మోయాల్సి వస్తే...మరో ఆడతోడు లేక చెప్పేవాళ్ళు.. సూచనలు ఇచ్చేవాళ్ళు ...సాయపడేవాళ్ళు లేకుంటే బయటకి చెప్పుకోలేని భాధ గుండెల్ని నిత్యం మెలిపెడుతూ ఉంటుంది..అమ్మ అంత విలువయినది... అమ్మ ఉన్నవాళ్లలో కొందరికి అమ్మ విలువ తెలియదు.అమ్మ చెప్పే మాటలకి చిరాకు పడతారు... అమ్మ మాటల్ని కొందరు ఖాతరు చేయరు... కొందరు ఎదిరిస్తారు... ఎగతాళి చేస్తారు... ఏమీ తెలియని మనిషిలా అమ్మని చులకనగా చూస్తూ ఉంటారు..అమ్మలేని ఆ భాధ నిత్యం నిశ్శబ్ద రోదనం... అమ్మ ప్రత్యక్ష దైవం...పూజలు చేయక్కర్లేదు.. దణ్ణాలు పెట్టక్కర్లేదు... అమ్మను ప్రేమగా చూడండి.. మీకు అరయ్యేళ్ళొచ్చినా ఇంకా మీకు అమ్మ బతికి ఉండి ఉంటే అది గొప్ప వరంగా భావించండి.. భారం అనుకోకండి... రోజులో ఒక్కసారయినా ఆమె పక్కన కూర్చోండి..కబుర్లు చెప్పండి..ఆమె బుజంమీద చేయి వేయండి.. నీకు నేనున్నాననే ధైర్యం, భరోసా కల్పించండి...శుభోదయ వందనాలతో.. ??..

మీ.. మహర్షి రమణ.

# ఈ నెల 21, 24 తేదీల్లో నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21, 24వ తేదీల్లో అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలు, కరపత్రాలను కలెక్టర్ కృతికా శుక్లా.. అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగులు ఉన్న పిల్లల్లో పోషకాహార లోపం ఏర్పడుతుందని.. ఎక్కువగా అలసిపోతారని దీంతో శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని వివరించారు. అల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా ఈ సమస్యల బారినపడకుండా చూడొచ్చన్నారు. 1-19 ఏళ్ల వయసు వారందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నామని.. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి, తమ పిల్లలు మాత్రలు తీసుకునేలా చూడాలన్నారు. 1-2 సంవత్సరాల చిన్నారులకు సగం మాత్ర, ఆపైన 19 ఏళ్ల వయసు వరకు ఒక మాత్ర వేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యా సంస్థల్లో గోడపత్రికల ద్వారా నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కల్పించి.. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ తదితర విద్యార్థులతో పాటు డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్ తొలి ఏడాది విద్యార్థులకు నులి పురుగుల మాత్రలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 1-5 సంవత్సరాల పిల్లలకు మాత్రమే నీటిలో పొడిచేసి ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డా. ఆర్.రమేశ్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ (ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే) డా. ఐ.ప్రభాకర్, డీఈవో డి.సుభద్ర, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ తదితరులు పాల్గొన్నారు..

## బెంగాల్ మాజీ మంత్రి పార్థా ఛటర్జీ ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ సీజ్



**కోల్‌కతా:** బెంగాల్ మాజీ మంత్రి పార్థా ఛటర్జీకి చెందిన సుమారు 48 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ సీజ్ చేసింది. ఆ రాష్ట్రానికి చెందిన ఎస్ఎస్సీ రిక్రూట్మెంట్‌లో మాజీ మంత్రి పార్థా ఛటర్జీ అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన సీబీఐ కస్టడీలో ఉన్నారు. అయితే డిపార్టమెంట్ పంపిన ఫైళ్లపైనే తాను సంతకం చేసినట్లు విచారణలో మంత్రి వెల్లడించారు. రిక్రూట్మెంట్ ప్రక్రియలో తన పాత్ర చాలా స్వల్పమైందని, అధికారుల్నే తాను నమ్మినట్లు మాజీ మంత్రి తెలిపారు.

## విపత్తు నష్టాన్ని నియంత్రించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విపత్తుల వలన సంభవించే నష్టాన్ని వీలయినంతవరకు నియంత్రించాలని ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు అన్నారు. సోమవారం ఏయూ హెచ్‌ఆర్‌డిసి కేంద్రంలో విపత్తుల నిర్వహణపై నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తిచేసుకున్న ఆచార్యులకు ఆయన సర్టిఫికేట్లను ప్రధానం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా, మానవ ప్రమేయంతో విపత్తులు సంభవించడం చూస్తున్నామన్నారు. విపత్తులు సంభవించినపుడు సన్నద్ధత, సత్వర స్పందన ఎంతో అవసరమన్నారు.ఈ అంశాలపై విద్యార్థులకు అవగాహన, తర్ఫీదును అందించాలని సూచించారు. తద్వారా విపత్తులు సంభవించిన సమయంలో వారు చురుకుగా స్పందించి ప్రాణ, ఆస్తి నష్టాలు లేకుండా చూడటం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డిసి కేంద్రం సంచాలకులు ఆచార్య ఎస్.ఏ.డి పాల్, డాక్టర్ రాజమాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు రాజ్యాధికారం ఎన్టీఆర్ ఘనతే



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** తెలుగుదేశం పార్టీతోనే బీసీల అభివృద్ధి సాధ్యం అని మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇంచార్జీ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. బీసీలకు రాజ్యాధికారం స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి చలువే అని అన్నారు. సోమవారం అనకాపల్లి పట్టణం,గవరపాలెంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్ మళ్ల సురేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా బీసీ సాధికార పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీల బాబు పోలవరపు త్రినాధ బొడ్డేడ జోగినాయుడు కాయల మురళి, కొణతాల శ్రీనివాసరావు, దాడి జగన్ సబ్బవరపు గణేష్ , నానాజీ తదితరులు పాల్గొన్నారు.

## 21, 24 తేదీలలో నులి పురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం లో భాగంగా ఈనెల 21,24 తేదీలలో జిల్లాలో గల సంవత్సరం వయసు నుండి 19 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలకు అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలు, కళాశాల విద్యార్థిని విద్యార్థులకు, కౌమార బాలబాలికలకు నులి పురుగుల నిర్మూలన నిమిత్తము అల్బెండజోల్ మాత్రలను ఉచితంగా ఇస్తారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏ.హేమంత్ తెలిపారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలలో ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. 2సం.ల లోపు వయసున్న పిల్లలకు సగం మాత్ర కరిగించి త్రాగించాలని, 2నుండి 19 సం. వయసు వారికి పూర్తి మాత్రను మధ్యాహ్నం భోజనం చేసిన అరగంట తర్వాత చప్పరించేటట్లు చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖల సహకారంతో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు.

## ఈనెల 26 నుండి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మహోత్సవాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలో శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం సంఘం ఈనెల 26 నుండి ప్రారంభం కానున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్ర మహోత్సవములు కరపత్రాన్ని సోమవారం ఆలయ మండపంలో ఆలయ అధ్యక్షులు బిళ్లపాటి కృష్ణకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26 నుండి అక్టోబర్ 5వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలియజేశారు.అమ్మవారు రోజుకు ఒక్కొక్క అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తారని. కన్యకల పూజలు, సువాసి నులపూజలు, ఈ ఏడాది ప్రత్యేకంగా లక్ష గాజులతో అమ్మవారికి అర్చన, ప్రతిరోజు సాయంత్రం ఆలయ మండపంలో పలు సంస్కృతి కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు. కోశాధికారి శ్రీధరాల సోమరాజు. ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల్ శ్రీనివాసరావు. కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక కుటుంబాలకు పట్టాలు పంపిణీ చేయాలి



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** సిఐటియు ఆధ్వర్యంలో చిట్టివలస జూట్ మిల్ క్వాటర్స్‌లో 40, 50 సంవత్సరాల నుంచి నివాసముంటున్న ఎవరు ఉంటున్న క్వార్టర్స్ వారికే చెందాలని జూట్ మిల్ క్వార్టర్స్ మొత్తం ప్రభుత్వం భూమి అయినందున కార్మిక కుటుంబాలకు పట్టాలు పంపిణీ చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆర్ డి ఓ గారికి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి ఐ టి యు జిల్లా నాయకులు ఆర్ ఎస్ ఎన్ మూర్తి నేటి మండల అధ్యక్షుడు అప్పలనాయుడు సేటు మండల ఉపాధ్యక్షులు ఆర్ నర్సింగరావు దామోదరం బాబాజీ సింగిడి అప్పారావు సింగిడి కొండమ్మ సర కనకదుర్గ పూసల కృష్ణవేణి మా దా బత్తుల పద్మ చంటి తదితర కార్టుంబాలు పాల్గొన్నాయి.

# సమస్యలపై ఆర్డీవోకు వినతి పత్రం సమర్పిం చిన విలేకరులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 19 సోమ వారం అన్ని నియో జకవర్గ కేంద్రాల్లో కోర్కెలు దినం కా ర్యక్రమాన్ని పాటిం చాలని జర్నలిస్టుల యూనియ న్ రాష్ట్ర నాయక త్వం పిలుపుని చ్చింది. దీంతో జిల్లా కేంద్రమైన అనకాపల్లిలోని జర్నలిస్టులు సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధాన మైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్డీఓకు వినతిపత్రం సమ ర్పించారు.

తమ డిమాండ్స్ ను రాష్ట్ర ప్రభు త్వం దృష్టికి తీసు కువెళ్లాలని కోరుతున్నామని ఆర్డీవోకు సమర్పిం చిన వినతి పత్రం లో కోరారు.

జర్నలిస్టులు ఇళ్ల స్థలాల సమ స్య అలానే ఉంది. ఎన్నికల ప్రణాళిక లో ఇచ్చిన ఈ హామీ అమలు కు ప్రభుత్వం వెంటనే చొరవ చూపి ఉత్తర్వులు జారీ చేసి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి. జర్నలిస్టులు ఆరోగ్య బీమా అమలు తీరు మెరుగుపరిచేందుకు వీలుగా ఎప్ప టికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించాలి. హెల్త్ కార్డులు అందరికీ అంద చేయాలి. అక్రిడేషన్ల జారీ ప్రక్రియ ఇప్పటికీ పూర్తి కాలేదు. అర్హులైన వారికి ఇప్పటికీ కార్డులు మంజూరు చేయ లేదు. అక్రిడేషన్ కమిటీల్లో ఏపీడ బ్ల్యూఎఫ్, ఏపీబీ జేఏలకు ప్రాతిని ధ్యం కల్పించాలని. కోరారు.

ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.వెంకటేష్, అన కాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బి. కొం డలరావు, కార్య దర్శి పి. రామకృష్ణ, సీనియర్ పాత్రికే యులు మాటూరు అజయ్, పి. సురే ష్, పి. జగన్నా థరావు, ఎస్. మాణిక్యం, శశికు మార్, బొడ్డేడ అ ప్పారావు, కోన లక్ష్మణ, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

# హిందీ పక్షోత్సవాల సందర్భంగా వ్యాసరచన,వక్తృత్వ పోటీలు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** 74 వ జాతీయ హిందీ పక్షోత్సవాల సందర్భంగా స్థానిక ఆదర్శ హిందీ ప్రేమీమండలి కార్యాలయంలో అధ్యక్షుడు కె.ఎస్.ఆర్ కృష్ణారావు ఆధ్వర్యంలో విద్యార్థినీ,విద్యార్థులకు వ్యాసరచన,వక్తృత్వ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర భాష హిందీ ప్రాధాన్యతపై రాష్ట్ర భాష ప్రావీణ,విశారద లో ఉత్తీర్ణత సాధించిన వారు వ్యాసరచన పోటీలో పాల్గొనగా,రాష్ట్రభాష ,రాష్ట్ర భాష నేర్చుకునే ఆవశ్యకత పై వక్తృత్వ పోటీలో పాల్గొన్నారు. అదేవిధంగా హిందీలో పద్యపఠన పోటీలు కబీర్ దాస్, తులసీదాస్, రహీం,మైథిలీ, శరణ్ గుప్త తదితరులు రాసిన దేశభక్తి పద్యాలు విద్యార్థినీ,విద్యార్థులు పద్య పఠనం చేసారు. రాష్ట్ర ప్రేమీమండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

# సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన నగర మేయర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని 4వ జోన్ కు సంబంధించిన సచివాలయాన్ని నగరమేయర్ గొలగాని హరి వెంకట కుమారి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి కార్యదర్శుల హాజరు, మూమెంట్ రిజిస్టర్, డైరీలను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా స్థాపించిన సచివాలయ వ్యవస్థ ను నిర్వీర్యం చేయకుండా ప్రజల నుండి స్వీకరించిన స్పందన అర్జీలను వెనువెంటనే పరిష్కరించాలని, పై అధికారులకు పంపాలని, సచివాలయాల ద్వారా అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు చేరువు అవ్వాలని, ప్రభుత్వం ప్రజల వద్దకే అన్ని సేవలు అందాలనే ఉద్దేశ్యంతో సచివాలయాలను స్థాపించి కార్యదర్శులుగా మీకు ఉద్యోగాలు ఇచ్చారని, ప్రజలకు సేవలు అందించి వారి మన్ననలు పొందాలని ఆదేశించారు. కార్యదర్శులలో కొంతమంది వివిధ పనులపై మూమెంట్ రిజిస్టర్, డైరీలలో నమోదు చేసి వెళ్ళాలని సిబ్బందికి తెలిపారు. కొంతమంది కార్యదర్శులు యూనిఫాం ధరించందున వారిని మందలించారు.

# అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ తో పండగల సంబరానికి సిద్ధంగా ఉండండి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అమేజాన్.ఇన్ పండగ కార్యక్రమం, ద అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ (జిఐఎఫ్) 2022 సెప్టెంబర్ 23, 2022 నుండి ఆరంభమవు తుంది. ప్రైమ్ సభ్యులకు త్వరగా అందుబాటులోకి వస్తుంది. లక్షలాది స్మాల్ మీడియం బిజినెస్ (ఎస్ఎంబీలు) నుండి విస్తృత శ్రేణి ఉత్పత్తులు పై ఇంతకు ముందు ఎన్నడూ చూడని డీల్స్ కస్టమర్స్ ఆనందించవచ్చు. జిఐఎఫ్ 2022 అమేజాన్ లాంచ్ పాడ్, అమేజాన్ సహేలీ, అమేజాన్ కారిగర్ వంటి వివిధ ఇతర కార్యక్రమాలు క్రింద, వివిధ భారతీయ మరియు అంతర్జాతీయ బ్రాండ్స్ శ్రేణులలో అమేజాన్ విక్రేతలు నుండి జిఐఎఫ్ 2022 కూడా ఉత్పత్తులను ప్రదర్శిస్తుంది.

ప్రకటన పై వ్యాఖ్యానిస్తూ, అమేజాన్ ఇండియాలో మనీష్ తివారి, కంట్రీ మేనేజర్, ఇండియా కంజ్యూమర్ బిజినెస్ ఇలా అన్నారు, "దేశీయ మరియు అంతర్జాతీయ బ్రాండ్స్, 2 లక్షల స్థానిక స్టోర్స్ నుండి ఉత్పత్తులు, సంప్రదాయబద్ధమైన కళాకారులు మరియు నేత పనివారు మరియు వివిధ స్టార్టప్స్ నుండి నవీన ఆఫరింగ్స్ యొక్క విస్తృత శ్రేణి ఎంపికని అందించే లక్షలాది విక్రేతలతో మేము కస్టమర్స్ కు సేవలు అందించడానికి ఉత్సాహంగా ఉన్నాము. అమేజాన్ గ్రేట్ ఇండియా ఫెస్టివల్ ఎలక్ట్రానిక్స్, కిరాణా సరుకులు, ఫ్యాషన్ మరియు బ్యూటీ, రోజువారీ అవసరాలు మరియు ఇంకా ఎన్నో వాటి నుండి కస్టమర్స్ భారతదేశం నుండి అతి పెద్ద ఎంపిక నుండి కస్టమర్స్ షాపింగ్ చేసే అవకాశం ఇస్తుంది. భారతదేశంలో సేవలు అందించగలిగే పిన్ కోడ్స్ అన్నింటికీ 2,000కి పైగా కొత్త ఉత్పత్తులు ఆరంభించడానికి మరియు వేగం మరియు భద్రతలతో ఉత్పత్తులను డెలివరీ చేయడానికి ప్రముఖ బ్రాండ్స్ తో భాగస్వామం చెందడానికి మేము ఆనందిస్తున్నాము. మేము విక్రేత మరియు భాగస్వామి విజయాన్ని గరిష్టం చేయడాన్ని కొనసాగిస్తాము మరియు ఇంగ్లీష్ తో పాటు 8 ప్రాంతీయ భాషలలో షాపింగ్ చేసే సౌకర్యం కేటాయిస్తాము. వాయిస్ ను కూడా ఉపయోగించి షాపింగ్ చేసే అవకాశం కల్పిస్తాము. మా కాంపైన్ ఒఅమేజాన్ నుండి కొన్నాము" తో గొప్ప పండగ సీజన్ కోసం మేము ఎదురుచూస్తున్నాము."

# గోకవరంలో బీజేపీ ప్రజాపోరు యాత్ర



**పాడేరు/కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):** అసెంబ్లీ ,పరిధిలో కొయ్యురు మండలం, చితంపాడు పంచాయతీ, గోకవరం గ్రామంలో ప్రజా పోరు యాత్ర,లో ముఖ్య అతిథి గా కేంద్ర కాఫీ బోర్డు మెంబెర్ , బీజేపీ గిరిజన రాష్ట్ర అధ్యక్షలు శ్రీ కురుస ఉమామహేశ్వరవు ప్రజా పోరు యాత్ర ప్రాంభించారు,,కేంద్ర ప్రభుత్వ రథసారథి శ్రీ నరేంద్రమోడీ గారు ప్రవేశపెట్టిన పథకాలు ప్రచారం అలాగే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి బీజేపీ తో సాధ్యం సూపరిపాలన దిశగా అడుగుల వేయడానికి బీజేపీ తో సాధ్యం అనే విషయాన్ని తెలజేస్తు మరియు రాష్ట్ర ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి నిరోధక విధానాలకు వ్యతిరేకంగా గ్రామ గ్రామన ప్రజలకు ఇఖ్యమత్యం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎలెక్షన్ లో ఇచ్చిన హామీలు నిలబతేవిధంగా ప్రభుత్వానికి డిమెండ్ చేస్తు ప్రజ పోరు యత్ర లో మాట్లాడమైంది... కార్యక్రమంలో మండలం అధ్యక్షులు శ్రీ ఎం అప్పలరాజు ,అధ్యక్షతన గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూడా కృష్ణారావు, జిల్లా ప్రోగ్రాం ఇంచార్జ్ సల్లా రామకృష్ణ,,కేంద్ర కాఫీ బోర్డు మెంబెర్ శ్రీ జైతి ప్రభాకర్ నాయకులు బోనంగి బాలయ్య పడల్ ,అర్మిల రాజు, చెందర్రావు, కాకరి చిన్నయ్యా ,శివ,కాకరపల్లి సుబ్రమణ్యం,కదుల శ్రీను,సోమేశ్,శివ,గ్రామ పేదలు గ్రామస్తులు హాజరయ్యారు.

# చిట్టి వలస జ్యూట్ మిల్లు కార్మికులు పిఎఫ్ పొందడానికి సిజెఎం వద్దకు వెళ్లాలి

**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** కొత్తగా పిఎఫ్ లు పెట్టుకునే కార్మికులు జ్యూట్ మిల్లు దగ్గరకు వెళ్ళి అప్లికేషన్ ను పెట్టాలనీ ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు జె.వి కైలాష్ రెడ్డి,దల్లి అప్పల రెడ్డి లు తెలిపారు.

అంతేకాకుండా గతంలో పిఎఫ్ పొందుట గురించి అప్లికేషన్లు పెట్టుకున్న కార్మికులు కూడా, వెరిపి కేసిన్ చేసుకునేందుకు వెళ్ళాలనీ చెప్పారు. గత కొద్ది కాలం క్రితం జ్యూట్ మిల్లులో లేబర్ ఆఫీస్ ప్రమాదం సొత్తు కాలిపోవడం వలన కార్మికులుకు చెందిన కొన్ని పైళ్ళు కాలిపోవడం వలన జ్యూట్ మిల్ వద్దకు వెళ్లి తమ పేరు ఉందో లేదో చూసుకోవాలనీ తెలిపారు.కార్మికులు, తమ జీతం టికెట్, బ్యాంకు బుక్, పాస్ ఫోటో ఇఎస్ ఐ కార్డు, ఆధార్ కార్డు మరణించిన వారి వయినట్లయితే నామిని సర్టిఫికెట్లు పట్టుకు వెళ్ళాలని అన్నారు.

# జిల్లా పద్మశాలి అధ్యక్షులుగా వానపల్లి



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 13 వ వార్డు, ఆరిలోవ ప్రాంతానికి చెందిన వైఎస్ఆర్ సిపి సీనియర్ నాయకులు వానపల్లి ఈశ్వర రావు ను విశాఖ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్నారు . ఈ సందర్భంగా శంకర మఠం, పద్మశాలి సంఘ భవనం లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విశాఖ జిల్లా వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది వక్తలు సమక్షంలో ఎన్నుకున్నారు . అనంతరం శాలువా కప్పి సన్మానించారు . ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ రాజకియంగా, సామాజికంగా ముందుకు కులాన్ని తీసుకు వెళ్ళడానికి నా వంతుకృషి చేస్తానని , ఎన్నుకున్న పెద్దలందరికి ధన్యవాదములు తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం కార్యదర్శి వానపల్లి వెంకట్రావు , జీవీఎంసీ కోప్షన్ నెంబర్ కొప్పుల ప్రభావతి , కొప్పుల రమేష్, సూరిశెట్టి సూరిబాబు, పెంటపెల్లి సత్యన్నారాయణ, కోడిదాస్ శ్రీనివాస్, చిక్కా సత్యన్నారాయణ, రాపర్తి సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

## రెవెన్యూ వెబ్ ల్యాండ్ సేవలను వెంటనే పునరుద్ధరించాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** గత 6నెలలుగా రెవెన్యూ వెబ్ ల్యాండ్ నందు సేవలను నిలిపివేయడం వలన రైతులు, కక్షిదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారనీ అనకాపల్లి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడుసందిన సునీల్, మండల తెలుగు యువత అధ్యక్షుడు "మరపురెడ్డి సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి చందక నరసింగరావులు అన్నారు. వారసత్వ భూములకు ముటేషన్లను చేయాలని డిమాండ్ చేశారు.గ్రామ,వార్డు సచివాలయ సిబ్బందికి రెవెన్యూ సేవలపై అవగాహన కల్పించాలని కోరారు. సోమవారం మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇంచార్జీ పీలా గోవింద సత్యనారాయణ ఆదేశాల మేరకు స్పందన కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పన కుమారికి వినతిపత్రాన్ని "అందజేశారు. రాష్ట్రంలో 80శాతం భూములు వారసత్వంగా సంక్రమించినవే అని,కానీ ప్రస్తుతం వెబ్ ల్యాండ్ నందు వారసత్వంగా వచ్చిన భూములకు ముటేషన్లను దరఖాస్తును నిలిపివేశారనీ అన్నారు.దీనివలన రైతు భరోసా,రైతు రుణమాఫీ, సబ్సిడీ ఎరువులు వంటివి కోల్పోతున్నారాని అన్నారు.

## రెండో వార్డులో పర్యటించిన కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** 2వ వార్డు కార్పొరేటర్ శ్రీమతి గాడు చిన్నికుమారి లక్ష్మి బ్యాంకు కాలనీ, మామిడి పాలెం, బోరపేట ప్రాంతాల్లో పర్యటించారు. డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. డెంగీ జ్వరాలతో బాధపడుతున్నామని ప్రజలు చెప్పారు. వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తానని చెప్పారు. బ్యాంకు కాలనీ దగ్గరి రాయపాలెం ఉన్నత పాఠశాల ను సందర్శించారు. ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి తరగతి గదుల్లోని స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్న విషయాన్ని మేడమ్ దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం సీనియర్ నాయకులు గాడు అప్పలనాయుడు , కోండ్రు కృష్ణ, డెక్కతి అప్పలరెడ్డి, చిల్ల ఎర్రయ్య రెడ్డి, జీరు సత్యం, సరగడ గోపిరెడ్డి, జీరు ఈశ్వర్రావు, పోతాబత్తుల చంటి, పోతాబత్తుల కళ్యాణ్,వనవాడ శివ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సోమవారం ఉదయం పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాల పరిధిలోని విద్యార్థినులకు నూతన హాస్టల్ ఏర్పాటు చేస్తున్న భవనాన్ని పరిశీలించి, పనులు ప్రగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రవేశాలు త్వరలో పూర్తయి విద్యార్థినులు వర్సిటీకి రావడం జరుగుతుందన్నారు. పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పనులను నిత్యం పర్యవేక్షించాలని రెక్టార్ ఆచార్య కె.సమతకు సూచించారు. కార్యక్రమంలో విద్యవిభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, యూనివర్సిటీ ఇంజనీర్ ఆర్.శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతా లోపాలు లేకుండా పక్కాగా నిర్మాణ పనులు చేపట్టాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పది కాలాలపాటు పదిలంగా ఉండేలా పక్కాగా నిర్మాణ పనులు చేపట్టాలని 82 వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకిరామరాజు కోరారు.జీవీఎంసీ అనకాపల్లి జోన్ 82 వ వార్డులో మంత్రి గుడివాడ అమర్నాథ్ సుమారు కోటి రూపాయలతో ఇటీవల శంకుస్థాపన చేసిన పనుల్లో భాగమైన నర్సింగరావుపేట జీవీ కోటేశ్వరావు వీధిలోని రహదారి నిర్మాణ పనులు, పాత కరెంట్ ఆఫీస్ వీధి లోని కాలువ నిర్మాణ పనులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, ఏఈ సుమిత్ర లతో కలిసి సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవి కోటేశ్వర వీధిలో రహదారి, పాత కరెంట్ ఆఫీస్ వీధిలో కాలువలు, విజయరామరాజుపేట మరిడిమాంబ నగర్, గాంధీనగరం డాక్టర్ రామ్మూర్తి వీదుల్లో రహదారులు, కాలువల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఎటువంటి నాణ్యతా లోపాలు లేకుండా నిర్మాణాలు చేపట్టాలని అధికారులు, సిబ్బందిని ఆమె కోరారు. నిర్మాణ సమయంలో స్థానికులకు అసౌకర్యం, ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. నిర్మాణ సమయంలో ఆయా ప్రాంతాలకు చెందిన వారి సూచనలు, సలహాలు కూడా స్వీకరించాలన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు పక్కాగా ఉండాలన్నారు.

మిగిలిన ప్రాంతాల్లో కూడా రహదారులు, కాలువల నిర్మాణ పనులు చేపట్టడానికి స్థానిక శాసనసభ్యులు, మంత్రి అమర్నాథ్ కృషి చేస్తున్నారని ఆమె వివరించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో అనకాపల్లి జోన్ లోని అన్ని సమస్యలను పరిష్కరించడానికి మంత్రి గుడివాడ అమర్నాథ్ కృషి చేస్తున్నారని చెప్పారు. నిర్మాణ పనులను స్థానికులు దగ్గరుండి పరిశీలించడంతో పాటు, నిర్మాణ పనులకు సహకరించాలని ఆయన కోరారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుండల రామకృష్ణ, పార్టీ నాయకులు ఈదలపాక శివ, కోన ఉమ, పేలూరి కళ్యాణ్, డొంక సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# కాఫీ రైతులకు మ్యాక్స్ సొసైటీ సభ్యత్వం ఎపి ఓ ( పిటిజి ) ఎం . వేంకటేశ్వర రావు



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** కాఫీ రైతులను మ్యాక్స్ సొసైటీలో సభ్యులుగా చేర్చాలని ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ( పిటిజి ) ఎం . వేంకటేశ్వరరావు అన్నారు . కాఫీ రైతులు రూ .110 లు చెల్లించి సభ్యులుగా చేరాలని చెప్పారు . సభ్యత్వ రుసుం చెల్లించన రైతులకు వెంటనే రసీదును అందజేస్తారన్నారు . సోమవారం ఆయన కార్యాలయంలో 11 మండలాల హార్టీకల్చర్ కన్సల్టెంట్లు , వ్యవసాయ విస్తరణాధికారులు , ఫీల్డు కన్సల్టెంట్లుతో సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 సంత్సరానికి సంబంధించిన కొయ్యూరు , జి.కె. వీధి , చింతపల్లి , జి.మాడుగుల , పాడేరు , పెదబయలు , హుకుంపేట మండలాల్లో లైజన్ వర్కర్లు పరిధిలోని కాఫీ , మిరియాల ఉత్పత్తుల అంచనాలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు . ఈ ఏడాది 15 వేల ఎకరాల్లో కాఫీ తోటలు పెంపకం పనులు పూర్తి చేసారన్నారు . ఎకరాకు వంద మిరియాలు , నీడ మొక్కలు మామిడి , నేరేడు , పనస మొక్కలు నాటే ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు . ఐటిడి ఏ పి హెచ్ ఓ ఎన్ . అశోక్ మాట్లాడుతూ కాఫీ రైతులను మ్యాక్స్ సొసిటీలో చేర్చడం వలన దళారీ వ్యవస్థను నిరోధించ వచ్చన్నారు . గిరిజన కాఫీ రైతులకు కనీస మద్దతు ధర అందించడానికి అవకాశం ఉంటుందన్నారు . కాఫీ పళ్లను సకాలంలో పల్పింగ్ ప్రక్రియ పూర్తి చేయడం వలన రైతుకు లాభదాయకంగా ఉంటుందన్నారు . చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్ మాదిరిగా జి.మాడుగుల , జి.కె. వీధి మండలాల్లో ఎకో పల్పింగ్ యూనిట్లను ఐటిడి ఏ పి ఓ రోణంకి గోపాల క్రిష్ణ నిర్మిస్తున్నారన్నారు . ఈ సమావేశంలో 11 మండలాల హార్టీకల్చర్ కన్సల్టెంట్లు , వ్యవసాయ విస్తరణాధికారులు , ఫీల్డు కన్సల్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఓక్రిడ్జ్ గ్లోబల్ యూనివర్శిటీ ఫెయిర్ 2022ని నిర్వహిస్తుంది

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పోస్ట్-మహమ్మారి దృష్టాంతం తల్లిదండ్రులు మరియు విద్యార్థులలో వారి కెరీర్ లక్ష్యాల గురించి అనేక సందేహాలను లేవనెత్తింది. విశాఖపట్నంలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ గ్లోబల్ యూనివర్సిటీ ఫెయిర్ 2022 ను అతి గొప్పగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమము ద్వారా 40 మందికి పైగా ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాల ప్రతినిధులుతో తల్లిదండ్రులు, మిడిల్ మరియు హైస్కూల్ విద్యార్థులు ముఖాముఖి సంభాషించి , వారి యొక్క సందేహాలను నివృత్తి చేసుకొనుటకు కొత్త కోర్సులను మరియు కెరీర్ ను ఎంచుకొనుటకు మంచి అవకాసము.

అందుబాటులో ఉన్న కోర్సులు, ప్రవేశ ప్రక్రియ మరియు స్కాలర్షిప్‌లతో సహా.

సెప్టెంబర్ 23 నుంచి విశాఖపట్నంలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ మేళా నిర్వహించనున్నారు

Time : 10:00 AM నుండి 3:00 PM. ఇది భారతదేశం, UK, USA నుండి విశ్వవిద్యాలయాల భాగస్వామ్యానికి సాక్ష్యంగా ఉంటుంది.

కెనడా, స్విట్జర్లాండ్, సింగపూర్ మరియు ఆస్ట్రేలియా. యూనివర్శిటీలు ఇల్లినాయిస్, యూనివర్శిటీ ఆఫ్ మసాచుసెట్స్, O.P. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ మరియు మరెన్నో.

విశాఖపట్నంలోని విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు వివిధ విశ్వవిద్యాలయాల యొక్క అర్హత, అవగాహనా గురించి ఇది సహాయపడుతుంది, ఈ కార్యక్రమము నందు

దరఖాస్తు ప్రక్రియలు, స్కాలర్‌షిప్‌లు, కెరీర్ పురోగతి అవకాశాలు మరియు ప్రొఫైల్-బిల్డింగ్ అనే విషయాల మీద మరింత అవగాహన కల్పించబడుతుంది.

భారతదేశంలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా రూపొందించబడింది.

విదేశాలలోను, మరియు ఇతర రాష్ట్రాలలోని విద్యార్థులు https://bit.ly/oisvuniversityfair ద్వారా ఆన్‌లైన్‌లో ఈవెంట్ కోసం నమోదు చేసుకోవచ్చు.

# ఘనంగా బోయి భీమన్న 111 వ జయంతోత్సవాలు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో తెలుగు అధికార భాషా సంఘం, హిందీ భవన్ సెమినార్ హాల్లో కళా ప్రపూర్ణ బోయి భీమన్న 111వ జయంతోత్సవాలు తెలుగు అధికార భాష సంఘం అధ్యక్షులు అచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అధ్వర్యంలో సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ముందుగా బోయి భీమన్న చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం తుల్లిమెల్లి విల్సన్ సుధాకర్ కు సాహితి పురస్కారం ప్రధానం చేశారు. ఈ సందర్భంగా తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ బోయి భీమన్న సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి అన్నారు. పేదరికంతో పాటు అంటరానితనం వంటి దురాచారాలు చిన్నప్పటినుండి భీమన్నకు అనుభవమేనన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన ఎన్నో పుస్తకాలను ఆయన తెలుగులోకి అనువదించారన్నారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉప కులపతి పి.వి.జి.డి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు కవులను, రచయితలను సత్కరించడం ద్వారా యువతకు మార్గదర్శకం అందుతుందని ప్రబోధించారు. మారుమూల పల్లెలో దళిత పాలేరు ఇంట పుట్టి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మభూషణ్ తో పాటు ఎన్నో గౌరవ సన్మానాలు అందుకున్న కవి బోయి భీమన్న అని పేర్కొన్నారు. సాహితీ పురస్కారం తన చేతుల మీదుగా అందించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

బోయి భీమన్న సతీమణి హైమావతి చరవాణి ద్వారా మాట్లాడుతూ ఆయన జీవితంలో ఎన్నో అడ్డంకులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. బోయి భీమన్న గురించి మరిన్ని పరిశోధనలు జరపాలని విశ్వవిద్యాలయం ఉప కులపతిని కోరారు.

తెలుగు రచయిత తుల్లిమెల్లి విల్సన్ సుధాకర్ మాట్లాడుతూ బోయ భీమన్న జయంతి పురస్కరించుకొని తనకు సాహితీ పురస్కారం అందజేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మరియు పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తుల్లిమెల్లి విల్సన్ సుధాకర్ కు దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు.

చివరగా హిందీ విభాగ అధ్యక్షులు నల్ల సత్యనారాయణ వందన సమర్పణ గావించారు.

ఈ కార్యక్రమంలో ఎ.యు రిటైర్డ్ ప్రొఫెసర్ మరియు లోక్ నాయక్ ఫౌండేషన్ ప్రతినిది నల్ల బాబయ్య , అధికార భాషా సంఘం కార్యాలయ సిబ్బంది, హిందీ, తెలుగు , పాలిటిక్స్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులు హెల్మెట్ తప్పక ధరించాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ద్విచక్రవాహనాలపై ప్రయాణించే సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి హాజరైన జిల్లా అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించి నట్లయితే దురదృష్టవశాత్తు ఎటువంటి ప్రమాదం జరిగినా 90శాతం ప్రాణహాని ఉండదని గుర్తుంచుకోవాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలలో ఈ-ఆఫీస్ ద్వారానే ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్వహించాలని, దీని మూలంగా లేఖల బట్వాడా వేగంగా జరుగుతుందని, కార్యాలయ ఖర్చు తగ్గుతుందని చెప్పారు. ఉద్యోగులందరికీ కంప్యూటర్ పరిజ్ఞానం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని, జిల్లా అధికారులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. దరఖాస్తులు, ఫిర్యాదులన్నింటికీ గడువు వరకు వేచి ఉండక వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. స్పందన కార్యక్రమం లో ఆయన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారి, డి ఆర్ వో పి. వెంకట రమణ కూడా దరఖాస్తులను స్వీకరించారు. డిఆర్వో వికలాంగుల వద్దకు వెళ్లి దరఖాస్తులు స్వీకరించారు.ఈరోజు స్పందనలో 210దరఖాస్తులు వచ్చాయి.

# జివిఎంసిలో "స్పందన"కు 74 వినతులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జివిఎంసి ప్రధాన కార్యాలయంలో "స్పందన" కార్యక్రమంను నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జివిఎంసి కమిషనర్ పి రాజా బాబుతో కలసి ఉదయం 11.00 గంటల నుండి నిర్వహించారు.

**"స్పందన" కార్యక్రమంలో స్వీకరించిన 74 ఫిర్యాదులు:** "స్పందన" కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా స్వీకరించిన ఫిర్యాదులు ఒకటవ జోనుకు 2, రెండవ జోనుకు 8, మూడవ జోనుకు 9, నాలుగవ జోనుకు 11, అయిదవ జోనుకు 25, ఆరవ జోనుకు 7, ఏడవ జోనుకు 1, ఎనిమిదవ జోనుకు 7, మెయిన్ ఆఫీసునకు 4, మొత్తము 74 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో పరిపాలనా విభాగానికి 1, రెవెన్యూ కు 7, ప్రజారోగ్యానికి 6, టౌన్ ప్లానింగ్ కు 28, ఇంజినీరింగ్ కు 7, యుసిడికి 23, హార్టికల్చర్ కు 2 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిశీలించి ఈ ఫిర్యాదులను 03 రోజులలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మేయర్, కమిషనర్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ వై. శ్రీనివాస రావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్జి శాస్త్రి, సిసిపి సురేష్, జెడి(అమృత్) విజయ భారతి, ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ వాసుదేవ రెడ్డి, సెక్రటరి పి నల్లనయ్య, ఎడి(హార్టికల్చర్) ఎం. దామోదర రావు, పిఆర్ఓ ఫణిరాం, రీజనల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయ లక్ష్మి, ఎఫ్.ఎ & ఎ.ఓ మల్లికాంబ, డిపిఓ చంద్రిక, పర్యవేక్షక ఇంజినీర్లు గోవింద రావు, వేణుగోపాల్, కృష్ణా రావు, రమణా రావు, శాంసన్ రాజు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చట్ట పరిధిలో చర్యలు చేపట్టి సత్వర న్యాయం అందించాలి



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకుజిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, ఐ.పి.ఎస్., "స్పందన" కార్యక్రమాన్ని సెప్టెంబరు 19, సోమవారం నిర్వహించారు. జిల్లాఎస్పీ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని, ఫిర్యాదు దారులకున్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. "స్పందన" కార్యక్రమంలో భాగంగాఎస్పీ 13 ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7 దినాల్లో సమస్యలను పరిష్కరించేందుకుచర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను, వెంటనే తనకు నివేదించాలని అధికారులను జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఓ.దిలీప్ కిరణ్, ఎస్పీసిఐ ఎన్.శ్రీనివాసరావు, డిసిఆర్బి ఎస్ఐ దినకర్ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.


## మోహన వెంకట రెస్ట్ హోమ్స్ (రి)

ప్రశాంతినగర్, తిరుపతి: ఫోన్ : 9393932718

మీరు ప్రతీఏటా తిరుపతి-తిరుమల పుణ్యక్షేత్రంలోని శ్రీవేంకటేశ్వర, పద్మావతి అమ్మవార్ల దర్శనం ఇష్టంగా చేసుకుంటూ ఉంటారు. రోజు రోజుకు పెరుగుతున్న భక్తుల కారణంగా ఇప్పుడు తిరుపతిలో గాని, తిరుమలలో గాని వసతి చాలా కష్టమవుతోంది.

ఇలాంటి సమస్యకు పరిష్కారంగా తిరుపతిలో (బస్‌స్టాండ్ రైల్వేస్టేషన్‌లకు కేవలం 8.5 కి.మి. దూరంలో) ప్రకృతి వనరులతో 14 ఎకరాల స్థలంలో ప్రశాంతినగర్ నిర్మాణంలో ఉంది.

అనేక అధునాతన సౌకర్యాలతో సుమారు 500 స్టూడియో అపార్ట్‌మెంట్లు మీకు అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే 40 అపార్ట్‌మెంట్లతో ఒక బ్లాక్ సిద్ధంగా ఉంది. 24X7 రవాణాసౌకర్యం కూడా యాజమాన్యం కల్పించింది.

సంవత్సరానికి 5 రోజులు ఈ సుఖప్రదమైన ఆవాసం పొందడానికి మీకు ఇప్పుడు చక్కని అవకాశం లభిస్తోంది. కేవలం ఒక లక్షరూపాయలు (+ 18శాతం జీఎస్టీ చెల్లించి) ఒక సింగిల్ బెడ్ అపార్ట్‌మెంట్‌ను మీరు ఒక సంవత్సరంలో 5 రోజులు చొప్పున 12 ఏళ్ల పాటు వినియోగించుకోవచ్చును.

లభించే సదుపాయాలు : ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ సదుపాయం. 24X7 రవాణా సౌకర్యం. మీరు స్వయంగా కూడా వాహనాలు నడపవచ్చు. (2,4 వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు) 24X7 క్లినిక్, గదిలో ఫ్రిజ్, మంచం, పరుపు, ఏసీ, సోఫా, టేబుల్, ఎల్‌పీజీ స్టౌ, గిన్నెలతో సహా కిచెన్.

పూర్తి శాఖాహార భోజన, ఫలహారశాల, అన్నిరకాల వస్తుసామాగ్రి దుకాణములు, వాకింగ్ ట్రాక్, ఈతకొలను, ఔషధ మొక్కలతో కూడిన వనసంపదల ఉద్యానవనం. అహ్లాదకరమైన ఆధ్యాత్మిక సంగీతభరిత వాతావరణం, ఉచిత వైఫై లభిస్తాయి.

24×7 రక్షణ, లాండ్రీ, ఇతర సేవలు లభిస్తాయి.

వివరములకు సంప్రదించండి.

9393949345, 8247526179


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345,
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96526 99699, Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999.